నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
మంగళవారం | అక్టోబర్ 01, 2024 | www.navatelangana.com

సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో సోమవారం నిజామబాద్ జిల్లా ప్రకృతి వ్యవసాయ నిపుణులు నాగుల చిన్ని కృష్ణుడు సేంద్రియ వ్యవసాయంపై ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంపై విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. నూతన వంగడాలు, నూతన పద్ధతులు అవలంభించి ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలో తెలిపారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ .నర్సింహారెడ్డి, అధ్యాపకులు వెంకటేష్, సురేష్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-నస్పూర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరికి గాయలైన సంఘటన సీసీసీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుగుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం..శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన వంగ శ్రీనివాస్(38) పని నిమిత్తం ఆదివారం రాత్రి మంచిర్యాలకు ఎరుకల రాకేష్‌తో కలిసి వెళ్లాడు. తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో శ్రీనివాస్ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేష్ చేయి విరగడంతో పాటు గాయాలవడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.



ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టులు..!

- డీఎస్సీ ఫలితాల విడుదలతో అభ్యర్థుల్లో ఆనందం
- నేటి నుంచి జిల్లాల వారీగా ధ్రువపత్రాల పరిశీలన
- ఎంపికైన వారికి ఈ నెల 9న నియామకపత్రాలు
- సర్కారు బడుల్లోకి అందుబాటులోకి రానున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఉపాధ్యాయ నియామకాల కోసం సుమారు నెల రోజుల పాటు నిర్వహించిన పరీక్ష ఫలితాలను సోమవారం విడుదల చేసింది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెరిట్ ర్యాంకులు సాధించిన అభ్యర్థుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గత ఏడేండ్ల అనంతరం నిర్వహించిన పరీక్ష కావడంతో అనేక మంది అభ్యర్థులు సర్కారు కొలువులపై ఆశలు పెట్టుకున్నారు. తాజా ఫలితాలతో ఉత్తమ శ్రేణి సాధించిన వారిలో సంతోషం వ్యక్తమవుతోంది. నేటి నుంచి(మంగళవారం) నుంచి ఈ నెల 5వ తేదీ వరకు ఆయా జిల్లాల వారీగా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నారు. అభ్యర్థులను ఒక్కో పోస్టుకు ఆయా కేటగిరీల వారీగా రోస్టర్ కం మెరిట్ ప్రకారం 1:3 పద్ధతిలో పరిశీలనకు పిలవనున్నారు. మెరిట్ సాధించిన అభ్యర్థులకు ప్రభుత్వం నుంచి నేరుగా సంక్షిప్త సందేశాలు, మెయిల్ రూపంలో సమాచారం రానుందని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి.



ఉమ్మడి జిల్లాలో 1295 పోస్టులు..!

డీఎస్సీ ఫలితాలు వెలువడటంతో ఉమ్మడి జిల్లాలో తాజాగా 1295 పోస్టులు భర్తీ కానున్నాయి. దీంతో ఆయా పోస్టుల కోసం ఏండ్లుగా ఎదురుచూసిన నిరుద్యోగుల ఆశలు ఫలించనున్నాయి. ఇది వరకు గత ప్రభుత్వం 2017లో ఉమ్మడి జిల్లా యూనిట్‌గా ఉపాధ్యాయుల నియామకం కోసం టీఆర్‌టీ పరీక్ష నిర్వహించింది. ఆ సమయంలో ఉమ్మడి జిల్లాలో 1582 పోస్టులు భర్తీ అయ్యాయి. ఇందులో కొన్ని మాధ్యమాల పోస్టులకు అభ్యర్థులు లేకపోవడంతో ఖాళీగా ఉండిపోయినట్లు తెలిసింది. సుమారు ఏడేండ్ల అనంతరం కొత్త ప్రభుత్వం గతంలో మాదిరిగానే డీఎస్సీ ద్వారా నియామకాలు చేపడుతోంది. ఆన్‌లైన్ ద్వారా ఈ ఏడాది జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించింది. తాజాగా నెలరోజుల్లోనే ఫలితాలు ప్రకటించడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. తాజాగా జిల్లాల వారీగానే డీఎస్సీ నిర్వహించడంతో ఎంపికైన అభ్యర్థులు సొంత జిల్లాలోనే పనిచేయనున్నారు.

ఈ నెల 9న నియామకపత్రాలు

డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఐదు రోజుల పాటు ధ్రువపత్రాల పరిశీలన నిర్వహించి ఎంపికైన వారికి ఈ నెల 9న నియామకపత్రాలు అందజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దసరా పండగకు ముందే అభ్యర్థులకు నియామకపత్రాలు అందజేయనుండగా.. పండగ సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు బడులకు వెళ్లనున్నారు. దీంతో సర్కారు బడుల్లో ఇన్నాండ్లు ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ కానున్నాయి. దీంతో పేద విద్యార్థులు అధికంగా చదివే సర్కారు బడుల్లో ఈ నెల నుంచే బోధకులు అందుబాటులోకి రానున్నారు. ముఖ్యంగా సబ్జెక్టు టీచర్లు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు సర్కారు తాజా నిర్ణయం వారికి ప్రయోజనం చేకూర్చనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాల వారీగా భర్తీ కానున్న పోస్టుల వివరాలు

పోస్టులు	ఆదిలాబాద్	కుమురంభీం	మంచిర్యాల	నిర్మల్
ఎస్ఏ	74	62	70	70
ఎల్‌పీ	14	25	16	04
పీఈటీ	02	02	03	04
ఎస్జీటీ	209	234	176	236
ఎస్ఏ(స్పెషల్)	06	03	05	05
ఎస్జీటీ (స్పెషల్)	19	15	18	23
మొత్తం	324	341	288	342

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

లైంగిక దాడికి గురైన బాలిక కుటుంబానికి అండగా ఉంటామని మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. సోమవారం బాలిక కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిస్థితి తీవ్రతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. నిందితునికి శిక్ష పడేలా చూడడంతో పాటు బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఇటువంటి సంఘటనలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేయకూడదని సూచించారు.

చిరుధాన్యాలపై అంగన్వాడీలో అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక జై జవాన్‌నగర్ అంగన్వాడి కేంద్రాల్లో చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో వివిధ రకాల వంటకాలు చేయించి చిన్నారులకు తినిపించారు. ఉప్మా, రాగి జావా లాంటి వంటకాలు చేసి, వాటిని తయారు చేసే విధానం, వాటి వల్ల కలిగే ఉపయోగాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ వి.రవికుమార్, సూపరింటెండెంట్ గౌతం, టిఏ రామకృష్ణ, జేటిఏ శ్రీనివాస్, టిసి చిందం అనిల్, అంగన్వాడీ టీచర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉత్పత్తే తప్ప సంక్షేమం పట్టని యాజమాన్యం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి యాజమాన్యం కేవలం ఉత్పత్తి మీద పెట్టిన శ్రద్ధ కార్మికుల రక్షణ, సంక్షేమంపై పెట్టడం లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) జనరల్ సెక్రెటరీ మంద నర్సింహారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే5 గనిలో కార్మికుల పెట్టెలను పగలగొట్టి వారి విలువైన వస్తువులను దోచుకెళ్లారు. గతంలోనూ ఇలాగే కార్మికుల విలువైన సెల్‌ఫోన్లు, పర్సులు పోయిన సంఘటనలు ఉన్నాయన్నారు. దాని నుండి గుణపాఠం నేర్చుకోలేదని పేర్కొన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లనే దాదాపు పదిమందికిపైగా కార్మికుల పెట్టెలను పగలగొట్టి వారి వస్తువులు తీసుకెళ్లారని, దీనికి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



నవతెలంగాణ-లోకేశ్వరం

మండలంలోని రాజూర ప్రాథమిక, జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో సోమవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గునుగు, బంతితో పాటు వివిధ రకాల పూలతో బతుకమ్మను అందంగా ముస్తాబు చేసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డీజే పాటలకు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం గ్రామ సమీపాన గల గోవింద చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రేగుంట రాజేశ్వర్, జెడ్ల రాజేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఎంపికైన వారికి నేటి నుండి వెరిఫికేషన్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డీఎస్సీ ఫలితాల్లో 1:3 లిస్టులో ఎంపికైన అభ్యర్థులకు ఆదిలాబాద్ డైట్ కళాశాలలో అక్టోబర్ 1 నుండి 5 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రణీత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టెక్స్ మెసేజ్, ఈమెయిల్ ద్వారా ఎంపికైనట్టు సమాచారం వచ్చినవారు మాత్రమే రావాలని సూచించారు. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. పరిశీలనకు వచ్చేటప్పుడు విద్యార్హతలు, బోనఫైడ్ క్యాస్ట్, ఆధార్ కార్డు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్స్ 2సెట్ల గజిటెడ్ సైన్‌తో రావాలని పేర్కొన్నారు.

గిరిజన మృత వీరుల స్థూపాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి

- రాష్ట్ర ట్రైకార్ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల కేంద్రంలోని గిరిజన మృతవీరుల స్థూపానికి రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బెల్లయ్య నాయక్, ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమర వీరుల స్థూప అభివృద్ధికి కోటి రూపాయలు మంజూరు చేసిందని తెలిపారు. స్థూపం వద్ద అద్భుతమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. నాగోబా ఆలయ అభివృద్ధికి సైతం కోటి రూపాయలు మంజూరు చేసిందన్నారు. ముందుగా కేస్లాపూర్‌లోని నాగోబా ఆలయానికి దర్శించుకున్నారు. నాగోబాకు పూజలు చేశారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయుల ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏమాయికుంటలోని ఇంద్రవెల్లి రైతు ఉత్పాదక కంపెనీని సందర్శించారు. రైతులతో మాట్లాడారు. రైతులకు అవసరమయ్యే పప్పు, ఆయిల్ మిల్లుల ఏర్పాటుకు నివేదిక పంపాలని, దాని మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. రైతులు తాము పండించిన పంటను దళారులకు అమ్మకుండా రైతు కంపెనీలో అమ్మడం హర్షదాయకమన్నారు. ఆయన వెంట ఐటీడీఏ డిడి వసంత్‌రావ్, స్థానిక నాయకులు ఉన్నారు.



అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : కలెక్టర్



కలెక్టరేట్‌కొచ్చిన సీసీఐ బాధిత రైతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజావాణికి వచ్చే అర్జీలను పెండింగ్ లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అర్జీలను స్వీకరించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుండి 59 అర్జీలను స్వీకరించడం జరిగిందని తెలిపారు. ఆయా శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం నార్నూర్ మండలం జామడ గ్రామనికి చెందిన ఆత్రం మారుతికి వీల్ చైర్‌ను అందజేశారు. పొచ్చెర గ్రామస్తులు తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయొద్దని కోరారు. నిషాన్‌ఘాట్, బెల్లూరి, ఆదిలాబాద్ గ్రామాలకు చెందిన రైతులు తమ భూములను సిమెంట్ పరిశ్రమకు ఇచ్చామని కలెక్టర్‌కు తెలిపారు. ఫ్యాక్టరీ ఏర్పాటైతే తమకు ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి సైతం చేయూతనందిస్తామని సీసీఐ యాజమాన్యం హామీనిచ్చింది. సీసీఐ మూతపడటంతో భూములను కోల్పోయిన తమకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని, పైగా ఈ భూములన్నింటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని సీసీఐ యాజమాన్యం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. దీనిపై కోర్టులో కేసు నడుస్తున్నందున భూముల విక్రయ నిర్ణయాన్ని విరమించుకుని తమకు న్యాయం జరిగేలా చూడాని కోరారు. బంగారుగూడ డంపింగ్‌యార్డులో మున్సిపాల్టీ అధికారులు నిర్మిస్తున్న గోవధశాలను నిలిపేయాలని పలువురు కలెక్టర్‌కు అర్జీ అందజేశారు. 30 ఏళ్ల కిందట ప్లాట్లు కొనుగోలు చేసి నివసిస్తుండగా ప్లాట్లను విక్రయించిన భూ యజమాని వారసులు ఈ భూమిని తిరిగి ధరణిలో వ్యవసాయ భూమిగా మార్చుకొని రైతుబంధు, రైతు బీమా వంటి ప్రభుత్వ ప్రయోజనాలను పొందుతున్నారని జైనథ్ మండల కేంద్రానికి చెందిన పలువురు ప్రజావాణిలో అర్జీ అందజేశారు. దీంతో భవిష్యత్తులో తమకు నష్టం కలిగే అవకాశమున్నందున దీనిపై విచారించి ఆ భూమిని ధరణలోంచి తొలగించి న్యాయం చేయాలని కోరారు.

నేర ప్రవృత్తిని విడనాడాలి : బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



నవతెలంగాణ-మందమర్రి

భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని నేరాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండే వారిపై రౌడీ షీట్ తొలగిస్తామని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం మందమర్రి సర్కిల్ కార్యాలయంలో రౌడీషీటర్లలో మార్పు కోసం కౌన్సెలింగ్ నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని రౌడీషీటర్లను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏసిపి మాట్లాడుతూ గతంలో నేరాలకు పాల్పడిన వారు నేర ప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో కొనసాగాలని, హుందాగా జీవించాలని సూచించారు. తొందరపాటులో నేరాలు చేసినా వారి కుటుంబ సభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని మారాలని హితవు చెప్పారు. రౌడీషీటర్ అనే పదం బిడ్డల భవిష్యత్‌ను కూడా నాశనం చేస్తుందన్నారు. డాక్టర్ బిడ్డలు డాక్టర్స్ అవుతున్నారని, పోలీస్ ఆఫీసర్ పిల్లలు పోలీస్ ఆఫీసర్స్ అవుతున్నారని, ఇదే మాదిరిగా రౌడీ షీటర్స్ పిల్లలు తమ తల్లిదండ్రులను అనుసరిస్తే నేరస్తులుగా తయారవుతారని పేర్కొన్నారు. నేరప్రవృత్తిని మార్చుకోవడానికి అవకాశం ఇస్తున్నామని, ఒకవేళ మారకపోతే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందని హెచ్చరించారు. రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రికార్డ్‌లో వారు చేసే మంచి పనులు కూడా ఎంటర్ చేస్తామన్నారు. పూర్తిగా మారితే రౌడీ షీట్ తొలగించేందుకు అవకాశం ఉందని చెప్పారు. గతాన్ని మరిచిపోయి మారిన మనసుతో ముందడుగు వేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి, సర్కిల్ ఎస్ఐలు, ఏఎస్ఐలు పాల్గొన్నారు.

'నాస్'లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

- ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్ దీపక్ తివారి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశవ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించనున్న నేషనల్ అచీవ్ మెంట్ సర్వే-2024లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. నేషనల్ అచీవ్మెంట్ సర్వేపై అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ అచీవ్మెంట్ సర్వే దేశ వ్యాప్తంగా నవంబర్ 19న నిర్వహించడం జరుగుతుందని, దీనిలో భాగంగా 3, 6, 9తరగతుల విద్యార్థులకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పరీక్షల నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రాండమైజేషన్‌లో 10 పాఠశాలలు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా 3 మాక్ టెస్టులు నిర్వహించడంతో పాటు వారాంతపు పరీక్షలు నిర్వహించి విద్యార్థులు నేషనల్ అచీవ్మెంట్ సర్వేలో అత్యున్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలని తెలిపారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు మీద ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో నాణ్యమైన విద్యను బోధించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రాష్ట్ర విద్య శిక్షణ పరిశోధన సంస్థ రూపొందించిన మోడల్ ప్రశ్నపత్రాలను వినియోగించుకొని విద్యార్థులతో సాధన చేయించాలన్నారు. 10వ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని తెలిపారు. నాస్ 2021 ఫలితాల కంటే 2024లో నిర్వహించే సర్వే ఫలితాలలో జిల్లా అగ్రస్థానంలో ఉండేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ప్రశ్నపత్రాలపై ఉపాధ్యాయులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులకు అభ్యసన దీపిక పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కో-ఆర్డినేటర్ ఉప్పులేటి శ్రీనివాస్, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అబీద్ అలీ పాల్గొన్నారు.

ప్రభుత్వోద్యోగికి ఉద్యోగ విరమణ సహజం

- జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. డిపిఓ కార్యాలయంలో కార్యాలయ సబార్డినేట్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పురుషోత్తంను డిఎల్పిఓ ఉమర్ హుస్సేన్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ సహజమని, అయితే ఉద్యోగంలో ఉన్నప్పుడు చేసిన సేవలు తర్వాతి జీవితంలో గుర్తింపు తీసుకు వస్తాయన్నారు. పురుషోత్తం సేవలు ఎంతో విలువైనవని, ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ వంశీకృష్ణతో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ సీఐ పదవీ విరమణ

ఆసిఫాబాద్ ఎక్సైజ్ సీఐగా పనిచేసి పదవీ విరమణ పొందిన దీపక్ దేశ్‌పాండే, అంజలి దంపతులను మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్ నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకుడు మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

రిమాండ్‌కు పీఎంపీ వైద్యుడు

నవతెలంగాణ-నస్పూర్

పీఎంపీ వైద్యుడు ప్రశాంత్‌ను సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు మంచిర్యాల రూరల్ సిఐ అశోక్ తెలిపారు. నాగార్జున కాలనీకి చెందిన శ్రీలత(25) మృతికి ప్రశాంత్ కారణమని తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అర్హత లేకుండా వైద్యం చేసి ఆమె మృతికి కారణమయ్యాడని ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
మంగళవారం | అక్టోబర్ 01, 2024 | www.navatelangana.com

పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభకు తరలిన నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం జరిగిన పీడీఎస్‌యూ 50వ స్వర్ణోత్సవ సభకు జిల్లా నుండి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ కోట్లాది మందిలో చలనాన్ని అందించి పోరుబాటలో నడిచిన సంస్థ పీడీఎస్‌యూ అని అన్నారు. ప్రగతిశీల విద్యార్థి ఉద్యమాలను బలోపేతం చేయడం ద్వారానే విద్యారంగ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఆయనతో పాటు పూర్వ నాయకులు నంది రామన్న, రాజన్న, జిల్లా అధ్యక్షులు సాయికుమార్, ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, శ్రీకాంత్, వినోద్ పాల్గొన్నారు.

యోగాసన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



నిజామాబాద్ జిల్లాలోని మున్నూరు కాపు సంఘ భవనంలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించిన 5వ రాష్ట్రస్థాయి యోగాసనా సీనియర్ మాస్టర్స్ పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు భార్గవ్ ప్రజ్యోత్ ఆర్టిస్ట్ పేరు విభాగంలో గోల్డ్ పథకంలో విజయం సాధించారు. ట్రెడిషనల్ విభాగంలో ప్రజ్యోత్ సిల్వర్, భార్గవ్ బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారు. దీనికి జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.తిరుపతి రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ అన్వేష్ బాబు, ట్రెజరర్ బి.రవీందర్ రెడ్డి, సెక్రటరీ సీహెచ్ చేతన్, జాయింట్ సెక్రెటరీ కే.సంతోష్, ఏ.రూప యోగాసనా సభ్యులు అభినందనలు తెలిపారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

- సీఐటీయూజిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వ ఆస్పత్రిలో ఐహెచ్ఎఫ్ఎంఎస్ విభాగంలో సానిటేషన్, పేషెంట్ కేర్ సెక్యూరిటీ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల వేతనం ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. సోమవారం సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్నారు. అనంతరం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పెరిక దేవిదాస్, జిల్లా కమిటీ సభ్యులు పండగ పొచ్చన్న, రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, ఉపాధ్యక్షులు భూపాల్, నాయకులు దశాంత్, రమేష్, రమా కాంత్, ఖలీల్, హరీష్, చంపత్, సోమనాథ్, శేఖర్, దత్తు, దేవేందర్ పాల్గొన్నారు.

జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ముథోల్

మండల కేంద్రంలోని రబింద్రా ఉన్నత పాఠశాలకు చెందిన వాత్సల్య అనే విద్యార్థిని జోనల్ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సాయినాథ్ తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్మల్ జిల్లా ఆధ్వర్యంలో సిర్గాపూర్‌లో జరిగిన అండర్ 14 కబడ్డీ పోటీలో విద్యార్థిని పాల్గొని జోనల్ స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థినికి కరస్పాండెంట్ రాజేందర్, ఛైర్మన్ భీంరావు దేశాయ్, పోతన్న యాదవ్ ఉపాధ్యాయులు అభినందించారు.

మానవత్వం చాటిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని ఆందోలి గ్రామ సమీపంలో ఓ యువకుడు బైక్ మీద నుండి కిందపడి గాయలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ క్రమంలో ఉట్నూరు నుండి ఇంద్రవెల్లికి వెళ్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మార్గమధ్యంలో క్షతగాత్రుడిని చూసి వాహనాన్ని నిలిపివేశారు. వెంటనే అంబులెన్స్‌కు కాల్ చేసి ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

ఎంఈఓను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-ముథోల్

మండల విద్యా వనరుల కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఎంఈఓ జి.రమణారెడ్డిని ఘనంగా సన్మానించారు. మండలంలో విద్య అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి రావుల గంగారెడ్డి, సీనియర్ నాయకులు కిషన్ పటేల్, గోపిడి ప్రేమ్‌నాథ్ రెడ్డి, పతంగి కిషన్, దిగంబర్, నాజీం హైమాద్, పోతారెడ్డి, నాగేష్, సాయినాథ్, మైసాజీ, హన్మండ్లు ఉన్నారు.

నేడు అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని జడ్పి సమావేశ మందిరంలో మంగళవారం మహిళ, శిశు , వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ వయోవృద్ధుల సమాఖ్య, ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి, మహిళా, శిశు, వికలాంగుల వయోవృద్ధుల శాఖ అధికారిణి సబిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకలకు వయోవృద్ధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అలాగే ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ, రిమ్స్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించుచున్నట్లు పేర్కొన్నారు.

అలజడి రేపిన వైస్ చైర్మెన్ రాజీనామా ప్రకటన

- బల్దియ చైర్మెన్‌కు ఇబ్బంది..

నవతెలంగాణ, ఖానాపూర్ టౌన్

ఖానాపూర్ వైస్ చైర్మెన్ కావలి సంతోష్ తన పదవికి రాజీనామ చేస్తున్నట్లు నిన్న రాత్రి ప్రటించారు. ఆయన ప్రకటన మున్సిపల్ పాలక వర్గంలో అలజడిగా మారింది. మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం, వైస్ చైర్మెన్ కావలి సంతు మధ్యన కొంత కాలంగా సఖ్యత కరవడినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే వైస్ చైర్మెన్ తన అసంతృప్తిని వెల్లగక్కినట్లు చెబుతున్నారు. కారణం ఏదైనా ఐదు నెలల క్రితం అవిశ్వాస తీర్మాణం ద్వార బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ చైర్మెన్‌కు ఇది మింగుడు పడిని అంశంగా మారింది. ఐదు నెలల క్రితం అప్పటి మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్, వైస్ చైర్మెన్ అబ్దుల్ ఖలీల్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం ప్రకటించి వారిని పదవి నుంచి తప్పించారు. గత చైర్మెన్ తీరు బాగా లేదని ఆరోపిస్తూ చిన్నం సత్యం అప్పట్లో అవిశ్వాసానికి తెరలేపి బాధ్యతలు చేపట్టారు. మరో మూడు నెలల కాలం గడిస్తే మున్సిపల్ పాలక వర్గం పదవీ కాలం పూర్తవుతుంది. ఈ క్రమంలో వైస్ చైర్మెన్ చేసిన రాజీనామ ప్రకటన పట్టణంలో చర్చానీయాంశంగా మారింది.



నాయకుల బుజ్జగింపులు

రాజీనామ ప్రకటన నేపద్యంలో కాంగ్రెస్ నాయకులు పరిమి సురేష్, జన్నారపు శంకర్, నిమ్మల రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ సోమవారం వైస్ చైర్మెన్ కావలి సంతోష్‌ను కలిశారు. ఆయన తీసుకున్న రాజీనామ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని బుజ్జగించినట్లు సమాచారం. చైర్మెన్ చిన్నం సత్యం అందుబాటులో లేనందున ఆయన వచ్చే వరకు ఆగాలని చెప్పినట్లు తెలిసింది.

పరామర్శించేందుకు వెళ్లాం..

తాము వైస్ చైర్మెన్ ఒక కుటుంబ సభ్యుల మాదిరిగా కలిసి ఉన్నామని, ఆయనకు జ్వరం వచ్చినట్లు తెలిసిన పలుకరించేందుకు వెళ్లినట్లు సదరు నాయకులు చెబుతున్నారు. బయట ప్రచారం అవుతున్న చిన్న సమస్య పెద్దదిగా చేయొద్దని వారు తెలిపారు. వైస్ చైర్మెన్ తన రాజీనామ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు మున్సిపల్ చైర్మెన్ చిన్నం సత్యం వాట్సాప్ ద్వారా తెలిపారు. అయితే వైస్ చైర్మెన్ కావలి సంతోష్ తన రాజీనామ ప్రకటనపై తీసుకున్న నిర్ణయం మాత్రం ఎటూ తెల్చకపోవడం గమనార్హం.

అండగా ఉంటాం..భయపడొద్దు



- మాజీ మంత్రి జోగురామన్న
- కాలనీవాసులతో మాట్లాడి భరోసా

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఖానాపూర్ చెరువు పరిరక్షణ పేరిట కలెక్టర్ ఆదేశాలతో అధికారులు సర్వే చేపడుతున్నారని, ఇండ్లు కూల్చేస్తారని ప్రజలు భయందోళనలో ఉన్నారని వారికి తాము అండగా ఉంటామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. సోమవారం పట్టణంలోని వార్డు 27, 28, 29 పరిధిలోని కొలిపుర, ఖానాపూర్, అంబేద్కర్ నగర్ కాలనీల్లో పర్యటించారు. మార్కింగ్ వేసిన ఇండ్లను పరిశీలించి ప్రజలతో మాట్లాడి భరోసా ఇచ్చారు. అదే విధంగా సర్వే చేస్తున్న సమయంలో ఖానాపూర్‌కు చెందిన గంగన్న సీఎం రేవంత్ రెడ్డిపై అనుచితంగా మాట్లాడారని కేసు నమోదైంది. గంగయ్య కుటుంబాన్ని రామన్న పరామర్శించి ఆధైర్యపడొద్దని తాము ఉన్నామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ ఖానాపూర్ చెరువులో ఎఫ్టీఎల్‌లో అక్రమణాలు జరిగాయని, గుర్తింపు సర్వే నిర్వహించారన్నారు. బఫర్ జోన్ 30 మీటర్లలోపు నిర్మాణాలను కూల్చేస్తామని అధికారులు చెప్పారన్నారు. తాతల కాలం నుంచి ఇక్కడ నివాసం ఉంటున్న తమ ఇండ్లను కూల్చేస్తారని భయందోళనతో రాత్రిళ్లు ప్రజలు నిద్రిపోవడం లేదన్నారు. గతంలో పేదలకు ఇదే కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి ఆ ఇండ్లు అక్రమ నిర్మాణాలుగా గుర్తిస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు ఎవరు బయపడాల్సిన అవసరం లేదన్నారు. ఖానాపూర్ చెరువు పరిసరాల నిరుపేదల ఇండ్ల మీదకు బుల్డోజర్లు వస్తే బీఆర్ఎస్ నాయకులందరు వచ్చి అడ్డుకుండారని తెలిపారు. ప్రభుత్వం కూడా పేదల పట్ల సానుకూలంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, కోవ రవి, పండ్ల శ్రీను, కొండ గణేష్, అయ్యూబ్, నారాయణ, స్వరూపరాణి ఉన్నారు.

పదవ తరగతి విద్యార్థులపై దృష్టి సారించాలి

- కలెక్టర్ రాజర్షి షా
- వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్యాగ్స్ పంపిణీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పదవ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి సబ్జెక్టుల్లో వెనుకబడిన వారిపై దృష్టి సారించి విద్యార్థుల సామర్థ్యాలను వెలికి తీయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సోమవారం పట్టణంలోని రణదీవేనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్యాగ్స్ పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్‌కు విద్యార్థులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ చిత్రపటాన్ని విద్యార్థులు గీసి కలెక్టర్‌కు అందించారు. దీంతో కలెక్టర్ ఆనందం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.90 వేల ఆర్థిక సహాయంతో 300 స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. వసుధ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ద్వారా స్కూల్ బ్యాగ్స్, అతిథి భోజన కార్యక్రమాలు చేపట్టటం అభినందనీయమని అన్నారు. ఈ పాఠశాలలో విద్యా బోధన బాగుందని, ఇదే స్ఫూర్తితో మంచి బోధన అందించి పదవ తరగతిలో మంచి ర్యాంకు సాధించాలని, దీనిద్వారా ట్రిబుల్ ఐటీలో సీటు సంపాదించి ఉన్నత లక్ష్యాలకు చేరుకోవచ్చని అన్నారు. పాఠశాలలో విద్యార్థులకు ఎన్ఏఎస్ పరీక్ష నిర్వహిస్తున్న సందర్భంగా విద్యార్థుల రైటింగ్, రీడింగ్, బేసిక్స్‌పై దృష్టి సారించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వార మౌళిక వసతులు కల్పించడం జరిగిందనీ, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతి వారం పేరెంట్స్ మీటింగ్ జరగాలని, దసరా సెలవులు అనంతరం పాఠశాలకు పంపించేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని కోరారు. మధ్యాహ్నం భోజనం నాణ్యమైనదిగా ఉండాలని మెనూ ప్రకారం అందించాలని, ఉదయం రాగి జావ అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, ప్రధానోపాధ్యాయులు భూషణ్ రెడ్డి, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ నరేందర్, సెక్రటరీ సత్యనారాయణ, స్కూల్ అసిస్టెంట్ లక్ష్మణ్, పరిమళ, శ్రీహరిబాబు, సభ్యులు పాల్గొన్నారు.



చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



- ఎస్పీ గౌస్ ఆలం
- గుడిహత్నూర్‌లో వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. సోమవారం గుడిహత్నూర్ మండలం ఆదర్శ పాఠశాలలో పోలీసుల ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. దీనికి ఎస్పీ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ముందుగా ఎస్పీకి డప్పు వాయిద్యాలు నడుమ స్వాగతం పలికి వేదికపై ఆహ్వానించారు. మొదటగా క్రీడలకు సంబంధించి జెండాను ఆవిష్కరించి, గలిలోకి బెలూన్లను పావురాలను వదిలి క్రీడలను ప్రారంభించారు. వాలీబాల్ టోర్నమెంట్‌లో జిల్లాలోని మారుమూల గ్రామాలలోని 50 జట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు ప్రజల రక్షణ, ప్రజల కోసం విధులను నెరవేరుస్తారని పేర్కొన్నారు. ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలీసులతో మమేకం కావాలన్నారు. యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించి జాతీయస్థాయి పోటీలలో పాల్గొని ఎదగాలని తెలిపారు. మారుమూల గ్రామాల్లో ఉన్న యువత నైపుణ్యాన్ని, క్రీడలపై ఉన్న ఆసక్తిని వెలికి తీసేందుకే ఇలాంటి టోర్నమెంట్లను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ప్రతి రంగంలోనూ విద్య, ఆటల్లో ప్రతి ఒక్కరూ పోటీ తత్వాన్ని కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతి, సోషల్ మీడియా దుర్వినియోగం, గంజాయి దుర్వినియోగం, గంజాయి వాడడం వల్ల భవిష్యత్తు ఆరోగ్యం పాడవుతుందని తెలియజేశారు. గంజాయిపై తమ మిత్రులకు, కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ క్రైమ్ ఎక్కువగా మొబైల్ ఫోన్ వినియోగించడం సోషల్ మీడియాలో గుర్తుతెలియని వ్యక్తులతో పరిచయాలు ఏర్పరచుకోవడం వల్ల ఎక్కువగా జరుగుతాయని, ఇలాంటివి సంభవించినప్పుడు వెంటనే జాతీయ హెల్ప్ లైన్ నెంబర్ 1930కు లేదా డయల్ 100కు సమాచారం అందించి సహాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ సీహెచ్ నాగేందర్, సీఐలు భీమేష్, రహీం భాషా, ఎస్సైలు ఇమ్రాన్, తిరుపతి, నవీన్, శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు, పీఈటీలు, క్రీడాకారులు సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజర్షి షాను కలిసి వినతిపత్రం అందజేశారు. మెనిఫెస్టోలో పెట్టిన ప్రకారం గౌరవ వేతనం ప్రకటించాలని, క్వింటాళ్ళకు రూ.300 కమీషన్ పెంచాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ ప్రింటెడ్ వే-బ్రిడ్జీలు ఏర్పాటు చేయాలన్నారు. రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని దిగుమతి హమాలీ ప్రభుత్వమే భరించాలన్నారు. ఒక శాతం తరుగు ఇవ్వాలని ప్రతినెల ఈ-పాస్ నుండి తీయాలని, డీలర్ చనిపోతే, దహన, సంస్కారాలకు రూ.50 వేల ఇవ్వాలని కోరారు. కరోనా మహమ్మారితో చనిపోయిన డీలర్లకు ఎటువంటి నియమ నిబంధనలు లేకుండా డీలర్షిప్ ఇవ్వాలన్నారు. గ్రామాలు పట్టణాలలో ప్రభుత్వ స్థలాలలో రేషన్ దుకాణం నిర్వాహణకు స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన రూ.20 పైసల కమీషన్ నుండి రాష్ట్ర ప్రభుత్వం వాటా రూ.10 పైసలు ఏప్రిల్-2022 నుండి నవంబర్-2023 వరకు ఏరియర్స్ విడుదల చేయాలన్నారు.

జిల్లాకు వచ్చిన నాగర్‌కర్నూల్ ఎంపీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

త్వరలో మహారాష్ట్రలో ఎన్నికలు జరిగే నేపథ్యంలో యావత్‌మాల్ జిల్లా కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకులు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ఆదిలాబాద్‌లో పర్యటించారు. ముందుగా కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఆయనకు నాయకులు స్వాగతం పలికారు. పూల బొకేలు అందించి శాలువాలతో సత్కరించారు. మహారాష్ట్రలో త్వరలో జరగనున్న ఎన్నికలలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని ఆయన తెలిపారు. యావత్‌మాల్ వషీం పార్లమెంట్ స్థానంతో పాటు సెగ్మెంట్‌లోని ఆరుకు ఆరు సీట్లు తామే గెలుస్తామని ధీమా వ్యక్తం చేసారు. జమ్ము కాశ్మీర్, హర్యాన ఎన్నికల్లోను హస్తం పార్టీ సత్తా చాటుతుందని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుప్పకూలడం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావడం తథ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్, ఎంఏ షకీల్, గోక గణేష్ రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ రెడ్డి, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు మునిగేల నర్సింగ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ, వైస్ ప్రెసిడెంట్ సోనియా మంథని, మాజీ జడ్పీటీసీ రాందాస్ నాక్లే, కౌన్సిలర్లు బండారి సతీష్, రామ్‌కుమార్ ఉన్నారు.

జీవితంలో రిటైర్మెంట్ డే ముఖ్యమైంది: ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పోలీస్ సిబ్బందికి జీవితంలో రిటైర్మెంట్ డే ముఖ్యమైనదని ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థకు సేవలందించి జిల్లాలో ప్రశాంతంగా కొనసాగడానికి అహర్నిశలు కష్టపడిన ప్రతి ఒక్కరి కృషిని అభినందించారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఎస్సైలు ఉషన్న, ఎస్డీ కాజా గౌస్ మొయినుద్దీన్, మోబిన్, అసిస్టెంట్ రిజర్వ్ ఎస్సై పీ లింగన్న, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లను ఎస్పీ కుటుంబ సభ్యుల సమక్షంలో శాలువ పూలమాలతో సన్మానించి బహుమతులు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థలు సుదీర్ఘ కాలం పాటు సేవలందించి, సంఘ విద్రోహశక్తులతో పోరాడి, ప్రశాంత వాతావరణంలో ప్రస్తుత జిల్లా ఉండడానికి కారణమైన సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. విరమణ అనంతరం ఆయురారోగ్యాలను కాపాడుకుంటూ కుటుంబ సభ్యులతో సంతోషంగా జీవించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆపరేషన్ బి.సురేందర్‌రావు, డీఎస్పీ బి.సురేందర్ రెడ్డి, సీసీ దుర్గం శ్రీనివాస్, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు గిన్నెల సత్యనారాయణ, చిందం దేవిదాస్, జైస్వాల్ కవిత, కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు పట్టాలతో పాటు సౌకర్యాలు కల్పించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావల మండల పరిధిలోని సర్వే 170లో గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి పట్టాలతో పాటు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట పార్టీ ఆధ్వర్యంలో దర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ లో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ... 2021-13లో మావల మేజర్ గ్రామపంచాయతీలో ఉన్నప్పుడు 1200 మందికి పట్టాలివ్వడం జరిగిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టాలిస్తే డబుల్ బెడ్ రూం ఇస్తామని చెప్పడంతో కొందరు పట్టాలు తిరిగి ఇచ్చేశారన్నారు. కానీ ఇప్పటి వరకు వారికి డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వలేదన్నారు. కానీ ఇప్పుడు రెవెన్యూ అధికారులు కొందరికి పట్టాలు చేసి ఇస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం అక్కడ గుడిసేలు వేసుకొని నివాసం ఉంటున్న వారికి కరెంట్, తాగు నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వే నిర్వహించి స్థానికంగా ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ముడుపు నళిని రెడ్డి, ఆరుణ్ కుమార్, రమేష్, కుంటాల రాములు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

• కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ ఆసిఫాబాద్



ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆసిఫాబాద్ ఆర్డీఓ లోకేశ్వర్ రావుతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్రస్థాయిలో అధికారులు కూడా దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



నేటి సమాజంలో విద్యకు ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా ప్రతి ఒక్కరు అక్షరాస్యులు కావాలని కాగజ్‌నగర్ ఎంపీడీఓ బి.రమేష్ అన్నారు. మండలంలోని చారిగాం ప్రాథమిక పాఠశాలలో సోమవారం న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారినపుడే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోగలుగుతారన్నారు. ప్రతి ఒక్కరు తాము చదువు నేర్చుకోవడమే కాకుండా ఒక్కొక్కరు మరో ఐదు మందికి చదువు నేర్పాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సుందిళ్ల రమేష్, గ్రామ కార్యదర్శి స్వప్న, మాజీ ఉప సర్పంచ్ మోర్లె తిరుపతి, యువజన అధ్యక్షుడు నగోసె తిరుపతి, గ్రామ పెద్దలు వడ్డె శంకర్ నీలాబాయి, మోర్లె తిరుపతి పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మిలో ప్రభుత్వ హామీ నెరవేర్చాలి

• ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు బంగారం కూడా అందించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జైనూర్ మండల పరిధిలోని 97 మంది, సిర్పూర్(యు) మండల పరిధిలోని నలుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయాల్సి ఉండగా లబ్ధిదారులు కొంతమంది రాకపోవడంతో 88 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో అధికారంలో ఉన్న తమ ప్రభుత్వం పేదల పెండ్లిలకు పెద్దన్నగా నిలిచే ఉద్దేశంతో కల్యాణ లక్ష్మి తీసుకు వచ్చిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికల్లో చెక్కుతో పాటు తులం బంగారం ఇస్తామని ప్రకటించిందని ఆ మాటను నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఆర్యవైశ్య సంఘం వినతులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వివిధ సమస్యలపై కలెక్టర్ వెంకటేష్ ధోత్రేకు జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. మహాసభ జిల్లా అధ్యక్షుడు గుల్బం చక్రపాణి మాట్లాడుతూ జిల్లాలోని జైనూర్‌లో జరిగిన అల్లర్ల నేపథ్యంలో 8 మంది వైశ్యులు తమ వ్యాపారాలు ధ్వంసమై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలుగు విశ్వవిద్యాలయానికి భాషా ప్రాతిపదిక రాష్ట్రాల కోసం ఆమరణ దీక్ష చేపట్టిన పొట్టి శ్రీరాములు పేరును యదావిధిగా కొనసాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టడానికి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. స్వాతంత్రోద్యమంలో కూడా పాల్గొన్న గొప్ప వ్యక్తి పొట్టి శ్రీరాములని కొనియాడారు. అటువంటి వ్యక్తి పేరును మార్చడం సరైనది కాదన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్, కోశాధికారి మైలారపు సుగుణాకర్, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం పోషకాహారం తీసుకోవాలి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

పిల్లలు బాల్య దశ నుంచి శారీరకంగా ధృఢంగా ఎదగాలంటే మంచి పోషకాలు, విటమిన్లు కలిగిన ఆహారాన్ని ఇవ్వాలని సిర్పూర్ ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి అన్నారు. సోమవారం రైతు వేదికలో పోషక మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు శారీరకంగా మానసికంగా ధృఢంగా ఎదగాలంటే ఆకుకూరలు, ఆయా కాలాలలో లభించే అటువంటి పండ్లు, పోషకాలు కలిగిన ఆహార వస్తువులను ప్రతి రోజు తీసుకోవాలన్నారు. గర్భిణులు వైద్యుల సూచన మేరకు పోషక ఆహార పదార్థాలను తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పౌష్టికాకరమైన ఆహారాల గురించి తెలియజేశారు. పోషక మాసం కార్యక్రమంలో పౌష్టిక కరమైన ఆహార వస్తువులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, కార్యదర్శి తిరుపతి, సూపర్‌వైజర్ పద్మ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉత్తీర్ణులకు ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ 2024 ఫలితాల్లో 1:3 నిష్పత్తిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నేటి నుండి ఈనెల 5వ తేదీ వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ధ్రువపత్రాల పరిశీలన కొనసాగనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి విద్యాధికారి యాదయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి 5 గంటల వరకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ఉంటుందని, అభ్యర్థులు వెరిఫికేషన్‌కు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు అటెస్టేట్ చేయబడిన రెండు సెట్ల జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని, 1:3లో సెలెక్ట్ అయిన అభ్యర్థులకు వారి మొబైల్‌కు ఎస్ఎంఎస్, మెయిల్ ద్వార సమాచారం అందించడం జరుగుతుందని వారు మాత్రమే హాజరుకావాలని పేర్కొన్నారు.

గోలేటిలో నియర్ బై బాస్కెట్ బాల్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

డబ్ల్యూపీఎస్, జీఏ 91వ వార్షిక క్రీడా పోటీలలలో భాగంగా గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో నియర్ బై బాస్కెట్ బాల్ క్రీడా పోటీలు మందమర్రి, బెల్లంపల్లి జట్ల మధ్య జరిగాయి. ఇన్‌చార్జి ఎస్ఓ టూ జీఎం ఉమాకాంత్ ముఖ్య అతిదిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి ఉద్యోగ క్రీడాకారులు కోల్ ఇండియా స్థాయిలో రాణించాలన్నారు. గతంలో కోల్ ఇండియా స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. నియర్ బై క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు కంపనీ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పర్సనల్ అధికారి డి.ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కిరణ్, జనరల్ క్యాప్టెన్ చంద్రకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

• ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు • సిబ్బందితో నెలవారి నేర సమీక్షా సమావేశం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లావ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణలో సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ స్టేషన్‌ల సిబ్బందితో నెలవారి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న దసరా నవరాత్రి ఉత్సవాలలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఆటోలకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ కేటాయించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ గ్రామాల్లో నేర నియంత్రణకు కృషి చేయాలన్నారు. జిల్లాలో అక్రమాలపై ఉక్కు పాదం మోపుతూనే ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీస్ స్టేషన్లను పరిశుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. ఆదివాసీ పోరాట యోధుడు కుమురం భీం వర్ధంతి వేడుకలకు నిర్దేశించిన ప్రకారం బందోబస్తు విధులు నిర్వహించాలన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే త్వరగా ఆ ప్రాంతానికి చేరుకునే ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ రామానుజన్, టాస్క్ ఫోర్స్ సీఐ రాణాప్రతాప్, రెబ్బెన సీఐ చిట్టిబాబు, పోలీస్ స్టేషన్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

• పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ -పెంచికల్‌పేట్



మండలంలోని ఎల్లూరు గ్రామ శివారులో ఏజీఎల్ వ్యవసాయ సాగు నిమిత్తం ఏర్పాటు చేసిన 63 కేవీ ట్రాన్స్ ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడంలేదని దాని కింద పంట సాగు చేసే రైతులు ఆవేదన చెందుతున్నారు. మూడు నెలల నుండి ప్రతినెలా ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోవడంతో విద్యుత్ అధికారులకు సమాచారం అందించామని, చెడిపోయిన ప్రతిసారి ఈజ్‌గాం, కౌటాలకు వెళ్లి సొంత ఖర్చులతో వాహనాలలో ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకొస్తున్నామని తెలిపారు. తెచ్చిన ప్రతిసారి రూ.10,000 ఖర్చు అవుతుందన్నారు. ప్రస్తుతం సెప్టెంబర్ 29న ట్రాన్స్ ఫార్మర్‌ను తీసుకొచ్చి బిగించగా వారం రోజుల్లోనే ట్రాన్స్‌ఫార్మర్ పాడైపోయిందని, ట్రాన్స్ ఫార్మర్ తరచూ చెడిపోవడంతో సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయన్నారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చిన పట్టించుకోవడంలేదని, దాని కింద సాగు చేసుకుంటున్న రైతులు నారాయణ, శేఖర్, మల్లేష్, రాంబాయి, సత్యనారాయణ, సమ్మయ్య పంటలు ఎండిపోతున్నాయని అంటున్నారు. ప్రతిసారి సొంత డబ్బులు పెట్టి ట్రాన్స్ ఫార్మర్‌ను తీసుకురావడం భారంగా ఉందని, ప్రస్తుతం చెడిపోయిన స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసి మమ్మల్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ అంజల్ కుమార్‌ను వివరణ కోరగా మూడుసార్లు చెడిపోయిన మాట వాస్తవమేనని, ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేక కొంత జాప్యం జరుగుతుందని, రెండు, మూడు రోజుల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తామన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలను పాటించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మహిళలు సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తూ, సమాజంలో ఆదర్శ మహిళలుగా ఎదగాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా అన్నారు. సోమవారం కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్ యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ శ్రద్దా శుక్లా మాట్లాడుతూ మహిళలు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని, క్రమశిక్షణ అలవర్చుకోవాలని సూచించారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయికృష్ణ మాట్లాడుతూ సమాజంలో జరిగే అన్యాయాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు ఎదిరించాలన్నారు. ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. సమాజంలో మహిళలపై నేడు అఘాయిత్యాలు పెరిగాయని, వాటిని ఎదుర్కొనేందుకు మహిళా చట్టాల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మినరసింహం, అధ్యాపకులు జనార్దన్, శారద, రాజేశ్వర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్, జిల్లా ఉపాధ్యక్షులు భీమేష్, జిల్లా సహాయ కార్యదర్శి నితీష్, నాయకులు భీంరావు, రక్షిత, తేజస్విని, టీనా, సాయికుమార్, అనికేత్ పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

నవతెలంగాణ-కౌటాల

మండలంలోని తాటిపల్లి గ్రామంలోనీ ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కౌటాల శాఖ ఆధ్వర్యంలో సోమవారం పచ్చదనం, పరిశుభ్రత, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాజాత బృందం పొదుపు చేయడంలో పాటించే మెలుకువలు, సామాజిక భద్రత పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంక్ నిర్వహణ శాఖ అధికారి రమేష్ మాట్లాడుతు ఆధార్ అనుసంధానం చేసుకుని వేలిముద్రల సాయంతో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సీఎస్పీ సెంటర్ల ద్వారా లావాదేవీలు చేసుకోవాలని, డిజిటల్ లావాదేవీలు జరిపేవారు తమ పాస్వర్డ్‌ను ఎవరికీ తెలియజేయకూడదని తెలిపారు. పంట రుణాలను సంవత్సరంలోపు చెల్లిస్తే ఏడు శాతం వడ్డీ ఉంటుందని, లేనిచో 12.50శాతం నుండి 14శాతం వరకు వడ్డీ రేటు ఉంటుందన్నారు. రైతులందరూ రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. మహిళా సంఘాల సభ్యులు సకాలంలో రుణాలను తీసుకుని నెలసరి సక్రమంగా కట్టాలని, బ్యాంకు ద్వారా లభించే రుణాన్ని మహిళ సంఘాలు వినియోగించుకోవాలన్నారు. అధిక వడ్డీ ఆశ చూపి మోసగించే వ్యక్తుల బారిన పడకుండా జాగ్రత వహించాలనీ, మీ ఆదాయాన్ని బ్యాంకులలో భద్రపరుస్తే సురక్షితంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీఎస్పీ మోరేశ్వర్, భాస్కర్, పాఠశాల సిబ్బంది, పిల్లలు తాటిపల్లి పంచాయతీ సెక్రటరీ అనుషా, ఐకేపీ సీసీ, సీఏ, గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బ్యాంకు పథకాలపై అవగాహన

తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డ్ వారి సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సును ముతంపేట గ్రామంలో బ్యాంకు పథకాలపై కళాబృందంతో అవగాహనకల్పించారు. రుణాలు, ఇన్సూరెన్స్ పథకాల గురించి ఎంపీ రూరల్ ఫోక ఆర్గనైజేషన్ కళాజాత బృందం పాటలు, మ్యాజిక్ షో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ రాజ్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మహేష్, కళాజాత బృందం సభ్యులు వెంకటేష్, రియాజ్ బ్యాంక్ సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

• ఏసీఎంఓ ఉద్దవ్
• జోనల్ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని ఏసీఎంఓ ఉద్దవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ బాలికల క్రీడా పాఠశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో జోనల్ స్థాయి పోటీలు నిర్వహించడం గర్వకారణం అన్నారు. విద్యార్థులు అందివచ్చిన అవకాశాల సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఆటల్లో గెలుపోటములు రెండు ఉంటాయన్నారు. గెలిచిన వారు గర్వపడొద్దన్నారు. ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా మరింత సాధన చేస్తు వచ్చే పోటీల్లో ప్రతిభ కనబర్చాలని సూచించారు. విద్యార్థులు వారి నైపుణ్యాలను ప్రదర్శిస్తు జిల్లా, జోనల్, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ అండర్ 17 జోనల్ స్థాయి పోటీలకు మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల నుండి 84 మంది బాలురు, 84 మంది బాలికలు హాజరయ్యారని తెలిపారు. వీరిలో 16 మంది చొప్పున ఎంపిక చేసి రాష్ట్ర స్థాయికి పంపుతున్నట్లు వివరించారు. ఎంపికైన 16 మంది అక్టోబర్ 3 నుండి 5 వరకు నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. క్రీడాకారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు, జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, కోచ్ అరవింద్, రాకేష్, పీడీ, పీఈటీ విద్యసాగర్, రవి, సాయి, రజిత, విశాల, దీపిక, రాజేశ్వరి పాల్గొన్నారు.

సమాజంపై అవగాహన కల్పించాలి

• జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పిల్లలకు చదువుతో పాటు సమాజంలోని అంశాలపై అవగాహన కల్పించాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయకర్త శారద అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా మహిళ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు చదువుతో పాటు అన్ని రకాల నైపుణ్యాలు కలిగి ఉండాలని, పిల్లలకు సమాజంలో జరిగే అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్యం, విద్య, చట్టాలు, పథకాలు, హక్కులు పిల్లలు తెలుసుకోవడం ఎంతో అవసరమని, అత్యవసర సమయాలలో హెల్ప్ లైన్లు 108, 181, 1098 ఉపయోగించుకోవడం తెలియజేయాలన్నారు. పిల్లల భవిష్యత్తుకు చదువు ఎంతో దోహదపడుతుందని, అన్ని రంగాలలో ముందుండేలా తోడ్పడుతుందని, పిల్లలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా కృషి చేసేలా ప్రోత్సహించాలన్నారు. పిల్లలకు స్వీయ రక్షణ ఎంతో అవసరమని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు ఆత్మ రక్షణ దిశగా తర్ఫీదు అందించాలని తెలిపారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై పిల్లలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి కవిత, సీఏ మమత, రాణి, రవళి, సాగర్, సత్యశీల పాల్గొన్నారు.

బాధితురాలికి అండగా ఉంటాం

• డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో లైంగికదాడికి గురైన బాధిత బాలికకు అండగా ఉంటామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. మాజీ ఎంపీపీ బాలేష్ గౌడ్‌తో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికపై లైంగికదాడి జరగడం బాధాకరమన్నారు. బాలికకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తానని చెప్పారు. ప్రభుత్వ పథకాల్లో బాధితురాలికి ప్రాధాన్యత ఉండేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాజీ మేకర్తి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేకర్థి కషయ్య, నాయకులు అరుణ్, సంజీవ్, పుదరి సాయికృష్ణ, శేకర్, ఇస్మాయిల్, కిరణ్, కృష్ణమూర్తి, అశోక్, వినోద్, ప్రవీణ్, మహేష్ పాల్గొన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ పొడిగింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా, ప్రశాంతతను పెంపొందించేందుకు జిల్లా అంతటా అక్టోబర్ 1 నుండి అక్టోబర్ 31 వరకు పోలీస్ యాక్ట్ 1861 అమల్లో ఉంటుందని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉన్నందున జిల్లాలో సబ్ డివిజనల్ పోలీస్ అధికారి లేదా పోలీస్ ఉన్నత అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎటువంటి పబ్లిక్ మీటింగ్‌లు, ఊరేగింపులు, ధర్నాలు జరుపరాదని సూచించారు. నిషేదిత ఆయుధములు కత్తులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు, నేరాన్ని పురిగోల్పే ఎటువంటి ఆయుధాలు వాడరాదన్నారు. జిల్లాలో 30 యాక్ట్ అమల్లో ఉన్నందున నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియమ నిబంధనలు విధి నిర్వహణలో ఉన్న పోలీసులకు, మిలిటరీ అధికారులకు, విధి నిర్వహణలో ఉన్న హోంగార్డ్స్, అంత్యక్రియ ఊరేగింపులకు అనుమతి అవసరం లేదన్నారు.

కార్మికులను మోసం చేసే యోచనలో బీఎంఎస్ : సీఐటీయూ

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు కార్మికులను మోసం చేసే యోచనలో బీఎంఎస్ ఉందని సీఐటీయూ అనుబంధ సిర్పూరు పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ విమర్శించింది. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మిల్లు పున:ప్రారంభమైన ఆరేండ్ల తర్వాత బీఎంఎస్ నాయకులకు కార్మికుల కష్టాలు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. 2021లో కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు పది మంది కార్మికులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి కార్మికులు వారి స్థాయిలో ఒప్పందం చేసుకున్నారని, దానిలో లొసుగులున్నా, అప్పట్లో ప్రత్యామ్నాయం లేదన్నారు. ఎంతో అనుభవం ఉన్న బీఎంఎస్‌కు ఎస్పీఎం కార్మికులు మూడు సార్లు అధికారం ఇస్తే, సస్పెండ్ అయిన నలుగురు కార్మికుల కోసం ఒక అగ్రిమెంట్‌నే ముంచిన ఘన చరిత్ర బీఎంఎస్‌దని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మరోసారి లబ్ది పొందేందుకు కల్లబొల్లి మాటలతో బీఎంఎస్ కార్మికుల ముందుకు వస్తోందని, కార్మికులు రాబోయే గుర్తింపు సంఘం ఎన్నికలలో గట్టిగా బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కూశన రాజన్న, ముంజం శ్రీనివాస్, అంగల శ్రీనివాస్, ఎస్ రాజన్న, జి మహేష్, ఆర్ రాజన్న, బి రమేష్, బి సదయ్య పాల్గొన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

2024-25 సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు నూతన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ 3 దశలలో ఉంటుందని, డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ దశలుంటాయని, మొదటి దశలో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో నూతన, రెన్యువల్ రిజిస్ట్రేషన్ భాగంగా తన ఆధార్‌కార్డు నంబర్‌ను సమర్పించి ఎస్ఎస్‌సీ వివరాలతో సరి చేసుకోవాల్సి ఉంటుందని, వివరాలు సరి అయిన తరువాత తదుపరి దశలో బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాలని, ఒక వేళ వివరాలు సరికానట్లయితే సంబంధిత విద్యార్థి తన ఆధార్ వివరాలను మీ-సేవ కేంద్రంలో అప్‌డేట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. 3వ దశలో గతంలో మాదిరిగా సంబంధిత ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసి ఉపకారవేతన వివరాలు పూర్తిగా నింపి దరఖాస్తును సమర్పించాలని, ఒకవేళ ఆధార్ సీడ్ కానట్లయితే వెంటనే సంబంధిత బ్యాంక్‌లో సంప్రదించాలన్నారు. 3 దశలలో దరఖాస్తు ప్రక్రియ పూర్తి అయిన తరువాత సదరు దరఖాస్తు తదుపరి ప్రక్రియకు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్‌కు సమర్పించాల్సి ఉంటుందని, కళాశాలల యాజమాన్యాలు షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు తగు సూచనలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఇతర వివరాలకు ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

నవతెలంగాణ
మంచిర్యాల
మంగళవారం | అక్టోబర్, 01 2024 | www.navatelangana.com

జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో స్లేట్ విద్యార్థి సత్తా



నవతెలంగాణ-జన్నారం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో మంచిర్యాల జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో మండల కేంద్రంలోని స్లేట్ హై స్కూల్‌కు చెందిన మనితేజ సత్తా చాటాడు. సోమవారం మంచిర్యాల జిల్లాలోని బాయ్స్ హై స్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీలో స్లేట్ పాఠశాలకు చెందిన ఎన్ మనితేజ అండర్-14 విభాగంలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ శ్రీ ఏనుగు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

పాఠశాల ప్రహరీగోడ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-లక్షెట్టిపేట



మండలంలోని జెండా వెంకటాపూర్, నాయకపుగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి సోమవారం ఎంపీడీఓ సరోజ భూమి పూజ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వార మంజూరైన రూ.6 లక్షల నిధులతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఈసి స్వామి, హెడ్ మాస్టర్ రామకృష్ణ, టెక్నికల్ అసిస్టెంట్ బూసిరాజు రాజన్న, పంచాయతీ సెక్రెటరీ హరికృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్స్ మురళీ, మోహన్, గ్రామ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెళ్తేపు రాంబాబు, పెట్టెం రవి, ఇండ్ల చిన్నయ్య, కొట్టె శ్రీనివాస్, బద్ది చిన్నయ్య పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లు బిగించాలి

- ఏఈ మనోహర్



నవతెలంగాణ-జైపూర్

నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన విద్యుత్ మోటర్ల వద్ద కెపాసిటర్లు విధిగా బిగించుకోవాలని జైపూర్ సెక్షన్ విద్యుత్ శాఖ ఏఈ మనోహర్ సూచించారు. పొలంబాట కార్యక్రమంలో భాగంగా సోమవారం కుందారం, వేలాల గ్రామ శివారుల్లో గల వ్యవసాయ బోరుబావులు, ట్రాన్స్‌ఫార్మర్లను సంధర్శించిన విద్యుత్ శాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం తీసుకోవల్సిన జాగ్రత్తలపై అవగాహణ కల్పించారు. వర్షాలు కురుస్తున్న సంధర్భంలో వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన స్టాటర్ బాక్స్‌లు, విద్యుత్ తీగలు, స్థంబాలు తడిసివుండి విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. వర్షం కురుస్తున్న సయమంలో విద్యుత్ మోటర్ల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. అదేవిధంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు స్థానిక సంబంధిత విద్యుత్ శాఖ ఉద్యోగులకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ షేక్ సైపోద్దీన్, ఫోర్‌మెన్ జావీద్, లైన్ ఇన్స్‌పెక్టర్ శంకర్, లైన్‌మెన్ పరమేశం, జేఎల్‌ఎం వెంకటేశ్ పాల్గొన్నారు.

ఓటమి తట్టుకోలేక ఏఐటీయూసీపై విమర్శలు



నవతెలంగాణ-మందమర్రి

ఓటమి తట్టుకోలేక టీబీజీకేఎస్ నాయకులు గెలిచిన ఏఐటీయూసీ యూనియన్‌పై విమర్శలు చేస్తున్నారని వాసిరెడ్డి సీతా రామయ్య మండిపడ్డారు. కెకె-5 గని వద్ద ఏఐటీయూసీ గని ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిదిగా ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ వాసిరెడ్డి సీతారామయ్య హాజరయ్యారు. 2023-2024 వచ్చిన లాబాల వాటాపై కొన్ని కార్మిక సంఘాల నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. 2009 నుండి 2024 వరకు లాభాల వాటాపై స్పష్టత ఉన్నదని అన్నారు. టీబీజీకేఎస్ నాయకులు సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఓటమిని తట్టుకోలేక గెలిచిన ఏఐటీయూసీ యూనియన్‌ని కావాలనుకుని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్రటరీ సోమిశెట్టి రాజేశం, ఆర్గనైజేషన్ సెక్రటరీ బానోతు నాగేశ్వరావు నాయక్, పి బాణయ్య, వర్కెన్ ఇన్స్‌పెక్టర్ విక్రమ్ సింగ్, వరప్రసాద్, కుమార స్వామి, ఫిట్ సెక్రటరీలు గాండ్ల సంపత్, మర్రి కుమార్, కె శ్రీనివాస్ పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి పోటీలకు ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు జూనియర్ స్థాయి పోటీల్లో విజయం సాధించి గిరిజన స్థాయి ఆటలకు ఎంపికైనట్లు గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల హెచ్ఎం శివరాజం తెలిపారు. డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు మంచి ప్రదర్శన కనబరచాలని మండలానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ సందర్భంగా వారిని హెచ్ఎం శివరాజం, హెచ్ డబ్ల్యు ఓ శాంత, పీడీ గణేష్ అభినందించారు.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

తల్లి బిడ్డల ఆరోగ్యం కోసం గర్భిణులు, బాలింతలు జాగ్రత్తలు పాటించాలని ఏసీడీపీఓ శ్రావణి సూచించారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా సోమవారం జైపూర్ మండల కేంద్రంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో స్థానిక ఎంపీడీఓ సత్యనారాయణతో కలిసి మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణపై అవగాహణ కల్పించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వార గ్రామీణ మహిళల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ కౌమార దశ బాలికలు తీసుకోవల్సిన పోశక ఆహారం, శిశువు తన మొదటి 1000 రోజుల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమల మట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై అవగాహణ కల్పించారు. ఈ సంధర్భంగా గర్భిణులకు సీమంతం, చంటి పిల్లలకు అన్న ప్రాసన చేయించారు. అదేవిధంగా పోషణ మాసం ప్రతిజ్ఞ చేయించడంతో పాటు ఎవ్వరికి వారుగా తమ వంటింటిలో పౌష్టికమైన ఆహారం తయారు చేసుకోవడం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్ అంగన్‌వాడి కార్యకర్తలు, వీఓ సభ్యులు పాల్గొన్నారు.

సందట్లో సడేమియా..!

ఇటీవల ఆర్ఎంపీల వైద్యం వికటించి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. చనిపోయిన వారు ఎలా చనిపోయారు అని ఇప్పటికీ జిల్లా వైద్య ఆరోగ్య శాక ప్రకటించలేదు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందక ప్రయివేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇందులో కొందరు 30 ఏండ్ల పైబడి వైద్యం అందిస్తున్న వారు ఉన్నారు. అనుభవంతో వైద్యం చేస్తూ ఉన్న కానీ అక్కడక్కడ వికటించి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు సందట్లో సడేమియా లాగా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక నాయకులు అర్ఎంపీలతో సెటిల్ మెంట్లు చేస్తున్నారు. ఇందులో బాధితులకు కొన్ని వీరికి కొన్ని అనే విమర్శలు వస్తున్నాయి.

- ఆర్ఎంపీ వైద్యం వికటించి ప్రాణాలు పోతున్నాయని అభియోగం
- ఆర్ఎంపీలను వేధిస్తున్న వైద్యారోగ్యశాఖ అధికారులు
- సెటిల్మెంట్లకు పోతున్న స్థానిక నాయకులు



నవతెలంగాణ-హాజీపూర్

ఇటీవల జిల్లాలో ప్రయివేటు వైద్యం వికటించి పలువురు ప్రాణాలు కోల్పోయారని అభియోగం వుంది. అర్హత లేకున్నా వైద్యం చేస్తూ అర్ఎంపీలు వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. ఈ మధ్య కాలంలో ఫిబ్రవరి నెలలో రామకృష్ణపూర్‌కు చెందిన ఓ పాపకు జ్వరం రావడంతో స్థానిక ప్రయివేటు వైద్యుడు చికిత్స చేశాడు. జ్వరం తగ్గక పొగా ఆ పాపకు ఫిట్స్ వచ్చింది. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకుపోగ ఆ పాప మరణించింది. ఈ విషయం బయటకు పొక్కకుండా జాగ్రత పడ్డట్టు తెలిసింది. గత వారం లక్షెట్టిపెట కొత్తకొమ్ము గూడెం గ్రామానికి చెందిన బత్తుల మధుకర్ జ్వరం వస్తుందని వైద్యం కోసం స్థానిక అర్ఎంపీ వద్దకు వెళ్ళగా గ్లూకోస్‌లో మూడు రకాల ఇంజెక్షన్‌లు కలిపి ఇచ్చాడని అందుకే తన కొడుకు మరణించాడని అతని తండ్రి ఫిర్యాదుతో పోలీస్‌లు ఆ ఆర్ఎంపీని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఆదివారం నస్పూర్‌కు చెందిన ఒసింగరేణి కార్మికుని భార్యకు జ్వరం రావడంతో అందుబాటులో ఉన్న ఓ పీఎంపీని సంప్రదించగా గ్లూకోస్ పెట్టీ సూది మందులు ఇవ్వడంతో చలి పెరిగి వాంతులు కావడంతో ఆరోగ్యం విషమించడంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడి నుండి కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అయి ప్రాణాలు కోల్పోయింది. ఇలా జిల్లాలో వరుస సంఘటనలు జరుగుతున్నాయి.

సెటిల్‌మెంట్లకు తెరలేపిన వైనం

జిల్లాలో ఆర్ఎంపీ వైద్యం వికటించిందనే అభియోగంతో పలువురు సెటిల్ మెంట్లు చేస్తున్నారు. అర్ఎంపీ బాధిత కుటుంబాలతో చర్చలు జరిపి మధ్యవర్తిత్వం చేస్తూ ఇదే అదునుగా అర్ఎంపీల నుంచి దండుకుంటున్నారు. ఇందులో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో పాటు, స్థానిక నాయకులు జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రుల యాజమాన్యాల హస్తం వున్నట్లు తెలుస్తోంది. సెటిల్ మెంట్లు చేస్తూ పర్సంటేజ్‌లు తీసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఓ పక్క ప్రయివేట్ వైద్యులను ఆశ్రయించద్దు అంటూ అర కోరా ప్రకటనలు, ప్రచారాలు చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ మరీ గ్రామాల్లో, పట్టణాల్లో జ్వర పీడితులకు చికిత్స అందించే ఏర్పాట్లు చేయకపోవడం తోనే గత్యంతరం లేక ప్రయివేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ ఆరోగ్య శాఖ జిల్లాలో ప్రతి గ్రామంలో జ్వర పీడితుల నమోదు చేసి, రోజు వారి ఆరోగ్య రిపోర్ట్ చేస్తూ వారికి సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం మండల విద్యాధికారిణి హెలెన్ డారతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ పాఠశాలలో యూ డైస్ అమలు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పలు రిజిస్టర్స్‌ను పరిశీలించారు. అదే విధంగా జాతీయ కనీస సామర్థ్య పరీక్షలపై కూడా అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. అంతకు ముందు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో మరింతగా ఉత్తీర్ణత పెరిగేలా ఉపాధ్యాయ బృందం కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలల సందర్శనతో విద్యా ప్రమాణాలు మరింతగా మెరుగు పడేలా కృషి చేస్తానని ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ, వసతి గృహ సంక్షేమాధికారి మల్లారెడ్డి, తెలుగు పండిట్ సత్యనారాయణ, స్పోర్ట్స్ ఆఫీసర్ జీవరత్నం ఉన్నారు.

సీజనల్ జ్వరాల తీవ్రత తగ్గింది

- మండల వైద్యాధికారి ముస్తఫా



నవతెలంగాణ-జైపూర్

సీజనల్‌గా వచ్చే జ్వరాల తీవ్రత తగ్గుముఖం పట్టిందని జైపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ముస్తఫా తెలిపారు. భీమారం మండలంలోని దాంపూర్ గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిభిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరాల వ్యాప్తి తగ్గినా కీళ్ల, కాళ్ల నొప్పులు సహజంగా ఉంటున్నప్పటికీ భయపడాల్సిన పనిలేదని అన్నారు. జ్వరం తగ్గినా కీళ్ల కాళ్ల నొప్పులు 15 నుండి 20 రోజుల వరకు ఉంటున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన 48 మందికి వైద్య పరిక్షలు నిర్వహించిన ఆయన 12 మందికి డెంగ్యూ టెస్ట్ చేసినట్లు తెలిపారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే జ్వరాలు తగ్గినా ఇప్పటి నుంచి మలేరియా, డెంగ్యూ జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. జ్వరాల వ్యాప్తిని నివారించడం కోసం ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. డెంగ్యూ దోమలు రాత్రి పూట కాకుండా పగటి పూట మాత్రమే కుడతాయని తెలిపారు. అదేవిధంగా డెంగ్యూ దోమలు మురికి నీటిలో కాకుండా శుభ్రమైన నీటిలో వ్యాప్తి చెందుతాయని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరాల వ్యాప్తిని నివారించడం కోసం ఎవ్వరికి వారుగా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ముస్తఫాతో పాటు పల్లె దవఖాన వైద్యులు అప్సరా, ఏఎన్ఎం వెంకటేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ వేణు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టుపురుగుల సాగు ఎంతో లాభదాయకం



నవతెలంగాణ-జన్నారం

రైతులు పట్టు పురుగుల సాగు ద్వారా లబ్ది చేకూరుతుందని, అధిక లాభాలు గడించవచ్చని రాష్ట్ర పట్టు పరిశ్రమల శాఖ జాయింట్ డైరెక్టర్ లత, సెంట్రల్ సిల్క్ బోర్డు సీనియర్ సైంటిస్టు వినోద్‌మార్ యాదవ్ పేర్కొన్నారు. సోమవారం మండలకేంద్రంలోని పొనకల్ రైతు వేదికలో ఉమ్మడి జిల్లా, జగిత్యాల జిల్లాలకు చెందిన రైతులకు పట్టు సాగుపై అవగాహన కల్పించారు. పట్టు సాగు ద్వారా వచ్చే లాభాలు, పంట పండించే విధానం, ప్రభుత్వం ఇచ్చే సబ్సీడీ, రైతు పెట్టుబడి తదితర అంశాలు వివరించారు. ఉమ్మడి జిల్లా పట్టు సాగుకు అనువైన ప్రదేశంగా పేర్కోన్నారు. అందుకే రైతులు పట్టు సాగుకు ముందుకు రావాలన్నారు. రైతు రెండకరాలలో పట్టు సాగు చేయడం ద్వారా రూ.7.50 లక్షలు ఖర్చు వస్తుందని పేర్కోన్నారు. ఇందులో ప్రభుత్వం నుంచి రూ.3.75 లక్షల సబ్సీడి వస్తుందన్నారు. ప్రస్తుతం పట్టు ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం పురోగమిలో ఉందన్నారు. ఒక ఎకరం మల్బరి తోట ద్వారా అరుగురు వ్యక్తులకు సంవత్సరం పొడవునా ఉపాధి దొరుకుతుందన్నారు. పట్టు గూళ్ల ద్వారా ఏడాదికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆదాయం చేకూరుతుందన్నారు. పట్టు పరిశ్రమ ద్వారా ప్రతి నెల ఆదాయం పొందవచ్చని, ఏడాదికి 5 నుంచి 10 పంటలు పండించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టు సాగు చేస్తున్న పలువురు రైతులు వారి అభిప్రాయాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎహెచ్ఎస్ఓ అనిత సెంట్రల్ సిల్క్ బోర్డు టెక్నికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, అసిస్టెంట్ సెరికల్చర్ డైరెక్టర్ పార్వతి, సెరికల్చర్ ఆఫీసర్ సురెందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-లక్షెట్టిపేట

అండర్-14, 17 బాలికల విభాగాలకు సంబంధించి రెజ్లింగ్ కుస్తీ రాష్ట్ర స్థాయి పోటీలకు లక్షెట్టిపేట తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు సంబంధించిన ముగ్గురు బాలికలు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ కె రమా కల్యాణి తెలిపారు. అండర్-14 విభాగానికి సంబంధించి ఒక్క బాలిక భువనేశ్వరి, అండర్-17 విభాగానికి సంబంధించి ముగ్గురు పావని, హారిక, అనుశ్రీలు ఎంపికైనట్టు ప్రిన్సిపల్ తెలిపారు. సోమవారం నిర్వహించిన జోనల్ స్థాయి ఎంపిక పోటీలు స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో నిర్వహించారు. పాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోన్‌గా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ నుంచి సుమారు 100 మంది విద్యార్థినులు ఈ ఎంపిక పోటీలో పాల్గొనగా, అందులో తమ పాఠశాలకు సంబంధించిన ముగ్గురు ఎంపిక కావడం విశేషమని అన్నారు. ఎంపికైన విద్యార్థులు ఉమ్మడి మహబూబ్నగర్ నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ ఫణి రాజా, పీడీలు తిరుపతి, సాంబమూర్తి, నాందేవ్, పీఈటీలు రాజేశ్, మమత, మహేష్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజం

- జిల్లా విద్యాధికారి యాదయ్య



నవతెలంగాణ-దండేపల్లి

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. సోమవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా చేసిన బీసగొని శంకర్‌గౌడ్ ఉద్యోగ విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో ఎన్ని సవాలు ఎదురైనా సమస్యలకు పరిష్కారం మార్గాలను ఆలోచించి ముందుకు వెళితే ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని విరమణ పొందిన ఉద్యోగులు తమ అనుభవాలను తోటి ఉద్యోగులతో పంచుకోవాలని ఆయన అన్నారు. ఎంతోమంది విద్యార్థులను ఆదర్శప్రాయులుగా తీర్చిదిద్దారని ఆయనను కొనియాడారు. ఉద్యోగ విరమణ తర్వాత తన శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో శేష జీవితం ఆనందంగా గడపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ దంపతులను ఆయన ఘనంగా సన్మానించారు.

లక్షెట్టిపేట : మండలంలోని దౌడపెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుడు రాధాకృష్ణ పదవి విరమణ మహొత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఎంఈఓ హెలెన్ డారతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 29 సంవత్సరాల 3 నెలలు వివిధ పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత రాధ కిషన్‌కు దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పెట్టం తిరుపతి, సాంబమూర్తి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



ప్రమాదం జరిగితే తప్ప రోడ్డును పట్టించుకోరా..?

- సంవత్సరం తిరగకముందే ఏర్పడిన సొరంగం



నవతెలంగాణ-వేమనపల్లి

ప్రమాదాలు జరిగితే తప్ప రోడ్డుపై గుంతను పట్టించుకోరా అంటూ వాహనదారులు అధికారులకు తీరుపై మండిపడుతున్నారు. ముల్కలపేట నుంచి రాచర్లకు వెళ్లే రహదారిలో బొందచేను ఒర్రె సమీపంలో ఉన్న కల్వర్టుకు సొరంగం ఏర్పడింది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి రోడ్డుపై ఏర్పడిన సొరంగం కారణంగా ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటుగా వెళ్తున్న వాహనదారులు చూసి ఏర్పడిన సొరంగం చుట్టూరా బండరాళ్లు పెట్టారు. రాత్రి సమయాల్లో వాహనదారులకు సొరంగం కనిపించకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉందని సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుపై ఏర్పడిన సొరంగం పూడ్చి ప్రమాదాలు నుండి ప్రజలను కాపాడాలని వేడుకుంటున్నారు.

నర్సాపూర్‌లో మానవ హక్కుల దినోత్సవం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని నర్సాపూర్ గ్రామంలోని ఆర్ఐ అంజన్ కుమార్, మాధారం ఎస్ఐ సౌజన్య సోమవారం మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టిలో ప్రజలంతా సమానమేనని కుల మత, జాతి లింగ వర్గ బేధాలు లేకుండా జీవించాలని తెలిపారు. బడి, గుడి వంటి సామాజిక ఆస్తుల్లో ప్రజలందరికీ సమాన హక్కులు ఉంటాయని తెలిపారు. అంటరానితనం కుల, జాతి వివక్షతను విడనాలని తెలిపారు. ప్రజలందర సోదర బావంతో కలిసి మెలిసి జీవించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్ పాల్గొన్నారు.

బాలికల ఆశ్రమ పాఠశాలలో అనీమియా పరీక్షలు

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఈఓ రవిదాస్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గిరిపోషణమిత్ర అనిమియా హెచ్‌బీ వైద్య పరీక్షలు చేశారు. 60 మంది బాలికల రక్తనమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. అనంతరం రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కె సిబ్బంది సంగీత, ఫార్మాసిస్టులు సాగర్, ప్రమోద్, ఏఎన్‌ఎంలు రుక్మిణి, శాంతబాయి, డీఈఓ రాజన్న, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్ పాల్గొన్నారు.

పెట్రోల్ పంపును ప్రారంభించిన ఏడీజీపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని యాపల్‌గూడ రెండవ బెటాలియన్ ఇండియన్ రిజర్వ్ పెట్రోల్ పంపును అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(ఏడీజీపీ) సంజయ్ కుమార్ జైన్ ప్రారంచారు. అనంతరం హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోశారు. బెటాలియన్ ప్రాంగణాన్ని సందర్శించి అధికారులతో సౌకర్యాలపై సమీక్షించారు. ఇందులో కలెక్టర్ రాజర్షి షా, బెటాయలిన్ కమాండర్ నితిక పంత్, అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చదరంగం పోటీలకు అంబటి అద్వితి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్ -15 బాలబాలికల చెస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థుల వివరాలను ఆర్గనైజింగ్ సెక్రటరీ నన్నపు స్వామి వెల్లడించారు. బాలికల విభాగంలోఅంబటి అద్వితి జిల్లా చాంపియన్‌గా నిలిచారు. ఆదిలాబాద్‌లోని విద్యానగర్‌లో నివాముండే అర్చన సారంగపాణి దంపతుల కుమార్తె అద్వితి ఎస్‌ఆర్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో మొదటి స్థానంలో నిలిచింది. ఇక బాలురుల విభాగంలో జే.కృష్ణ మహిత్ మొదటిస్థానం కైవశం చేసుకున్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు స్వామి తెలిపారు. బాలికల విభాగంలో రెండవ స్థానంలో ఏ చైతన్య, థర్డ్ ఫ్లేస్ ఎస్ లక్ష్మి, రాశి కేతాన్ నాల్గవ స్థానంలో నిలిచారు. బాలుర విభాగంలో జె.కృష్ణ మహిత్, ఫురాన్‌లు మొదటి రెండు స్థానాల్లో నిలవగా యువ చారి, రామ్‌చరణ్ మూడు నాలుగు స్థానాల్లో నిలిచారు. వీరంతా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికకాగా ఈనెల 29న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాతరపున పాల్గొంటారని పేర్కొన్నారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు సయ్యద్ ఫర్జాన్

నవతెలంగాణ-కడెం



ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదవ తరగతి విద్యార్థి సయ్యద్ ఫర్జాన్ అండర్ 14 బాలుర జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్ రెడ్డి, పీడీ బి.వెంకటరమణ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఫర్జాన్ అత్యుత్తమ ప్రతిభ కనపరిచి త్వరలో జరుగనున్న జోనల్ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల విద్యార్థి జోనల్ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

సాధారణ ఆరోగ్య బీమాతో ప్రయోజనం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రవేశపెట్టిన సాధారణ ఆరోగ్య బీమాతో ఖాతాదారులకు ప్రయోజనం ఉంటుందని నజ్రుల్‌నగర్ ఎస్‌బీఐ మేనేజర్ సందీప్ అన్నారు. నజ్రుల్‌నగర్ బ్రాంచ్‌లో సాధారణ ఆరోగ్య బీమా చేసుకున్న విజయ జ్వరంతో ఆస్పత్రిలో చేరగా, ఆమెకు రూ. 32 వేల ఖర్చు అయింది. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును సోమవారం బ్యాంక్ మేనేజర్ సందీప్ ఆ మహిళకు అందించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ సాధారణ ఆరోగ్య బీమా చేసుకున్న వారు ఆస్పత్రిలో చేరితే వారి వైద్యానికి అయిన ఆస్పత్రి ఖర్చులను చెల్లించడం జరుగుతుందన్నారు. ఖాతాదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ మేనేజర్ నరేష్, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులులేని మందులు స్వాధీనం

నవతెలంగాణ-వాంకిడి



అనుమతులు లేని మందులను రోగులకు ఆర్‌ఎంపీ ఇస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు పరిశీలించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని దాబా గ్రామంలో సోమవారం ఆర్‌ఎంపీ వైద్యుడు కొండల్ సంతోష్ అనుమతులు లేకుండా యాంటిబయోటిక్ మందులను జ్వరాల బారిన పడిన బాధితులకు అమ్ముతున్నారు. సమాచారం మేరకు వాంకిడి పోలీసులు అక్కడికి చేరుకొని మందులను పరిశీలించి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మందులను వాంకిడి పోలీస్ స్టేషన్‌కు తరలించి, డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్‌కు అప్పగించడం జరిగిందని ఎస్‌ఐ ప్రశాంత్ తెలిపారు. పట్టుకున్న మందుల విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. దీనిపై డ్రగ్స్ ఇన్స్‌పెక్టర్ పూర్తి విచారణ జరిపి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

నేడు ఉచిత కంటి శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రజా లైఫ్‌కేర్ ఆస్పత్రిలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి పరీక్షా శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షులు, ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు తెలిపారు. కంటి శుక్లాలు ఉన్న వారికి, కంటి చూపు మందగించిన వారికి ఈ శిబిరంలో పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు కూడా చేయించనున్నట్లు ఆయన తెలిపారు. ఓటరు గుర్తింపు, ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌లతో పాటు రెండు పాస్ ఫోటోలతో శిబిరానికి రావాలని సూచించారు.

నేటి జాబ్ మేళాను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

టాస్క్ ద్వారా మంగళవారం నిర్వహించే జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని రీజినల్ సెంటర్ మేనేజర్ సాయికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు జిల్లా కేంద్రంలోని టాస్క్ రీజినల్ సెంటర్ కార్యాలయం (పాత కలెక్టర్ భవనం)లో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని, ఈ జాబ్ మేళాను డిగ్రీ పూర్తి చేసి వయసు 30 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువతీయువకులు అర్హులని, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మహాసభలు జయప్రదం చేయాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి



నవతెలంగాణ-మందమర్రి

సీపీఐ(ఎం) జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి కోరారు. సోమవారం మందమర్రిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా 3వ మహాసభలను మందమర్రిలో అక్టోబర్ 29, 30 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో మూడు సంవత్సరాలుగా పార్టీ చేసిన పోరాటాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చేసిన పోరాటాలపై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. బీజేపీ ప్రభుత్వం శ్రావణ పల్లి బొగ్గును వేలం పాటలో పెట్టి ప్రయివేట్ కార్పొరేట్ సంస్థలకి కట్టబెట్టాలని నిర్ణయం చేసిందని దీన్ని వ్యతిరేకిస్తూ సింగరేణి సంస్థకే బొగ్గు బ్లాక్‌ను ఇవ్వాలని పార్టీ సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను నిర్వహించిందని గుర్తు చేశారు. మందమర్రి తోళ్ల పరిశ్రమలు తెరిపించి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తోళ్ల పరిశ్రమను పరిశీలించారని తెలిపారు. విష జ్వరాలతో అల్లాడిపోతున్న ప్రజలను కాపాడాలని గ్రామ, మండల, పట్టణ స్థాయిలో పర్యటనలు చేసి జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేశామన్నారు. కుల వివక్షత పేరుతో దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ దళితులకు అండగా నిలిచామన్నారు. దండేపల్లి మండలం కోయపోచగూడెం ఆదివాసుల సాగుభూముల పోరాటం, చెన్నూరు ప్రాంత పేద ప్రజలకు ఇంటి స్థలాల సాధనకు పోరాటం, పోడు సాగు భూములకు హక్కు పత్రాలు, ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను, సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, లాభాల్లో వాటా ఇవ్వాలని జరిగిన పోరాటాలకు సీపీఐ(ఎం) అండగా నిలిచి, సుదీర్ఘకాలం పోరాటం చేసి విజయం సాధించడం జరిగిందన్నారు. చెరువులను ఆక్రమించిన వారిని, భూ కబ్జా దారులను, అవినీతి అధికారులను, అక్రమాలకు అండగా నిలిచిన ప్రజా ప్రతినిధులను వదిలేసి హైడ్రా పేరుతో పేద, మధ్య తరగతి ప్రజలపై దాడి చేస్తుందని మండిపడ్డారు. రాబోవు కాలంలో సీపీఐ(ఎం) ప్రజల తరుపున చేసే పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం కోసం అక్టోబర్ 29,30 తేదీలలో జిల్లా 3వ మహాసభలను మందమర్రిలో జరుపుతున్నట్లు వెల్లడించారు. ఈ మహాసభల జయప్రదం చేయడానికి ఆర్థిక సహాయ సహకారాలు అందించాలని, పార్టీ చేసే పోరాటాలకు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, పట్టణ నాయకులు మరుపాక తిరుపతి, దూలం అంజలి, కుమార్ పాల్గొన్నారు.

అలరించిన సైన్స్ డ్రామా ఫెస్టివల్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో సోమవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సైన్స్ డ్రామా ఫెస్టివల్లో జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అద్భుతమైన ప్రదర్శనలతో అలరించారు. మానవజాతి పురోగతి కోసం శాస్త్ర సాంకేతికత అనే అంశంపై విద్యార్థులు నాటికలను ప్రదర్శించారు. ఈ పోటీల్లో ఆసిఫాబాద్‌లోని జనకాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జట్టు ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి పోటీలకు ఎంపిక కాగా ద్వితీయ స్థానంలో సిర్పూర్ చెందిన ఈడెన్ గార్డెన్ స్కూల్, తృతీయ స్థానంలో ఆసిఫాబాద్‌లోని సిగ్మా పాఠశాల విద్యార్థులు నిలిచారు. వీరికి జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్, ముఖ్య అతిథి బీఈడీ కళాశాల కరస్పాండెంట్ తాటిపల్లి శివప్రసాద్, జ్యూరీ కమిటీ రాజ్ కమలాకర్ రెడ్డి, కిల్లీ వెంకట్‌రావు, మామిడాల తిరుపతయ్య, ఈవెంట్ కన్వీనర్ డి.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఉత్తమ డైరెక్టర్‌గా వి.రాజేశ్, ఉత్తమ స్క్రిప్ట్ రైటర్‌గా సాగర్ కుమార్, ఉత్తమ నటులుగా శ్రీవాస్తవ, నబా హూరియాలు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి మధుకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో నైపుణ్యం సాధించాలనే ఉద్దేశంతో రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఈ సైన్స్ గ్రామ ఫెస్టివల్ నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థులు తమ సృజనకు పదును పెట్టి, కళా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా జీవితంలో గుర్తింపు పొందాలని సూచించారు.

డయాలసిస్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో రోగులకు మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ(ఐ) జిల్లా కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రజావాణిలో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ మాట్లాడుతూ డయాలసిస్ కేంద్రంలో మందులు అందుబాటులో ఉంచాలన్నారు. జనరేటర్‌లో వేయడానికి డీజిల్ అందుబాటులో లేకపోవడంతో రాత్రిపూట పేషెంట్లు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, డీజిల్ అందుబాటులో ఉంచి రోగులకు నిరంతర వైద్యం జరిగేలా చూడాలన్నారు. డయాలసిస్ రోగులకు రక్తం పెరుగుదలకు సంబంధించిన ఇంజక్షన్‌లు, ఐరన్ ఇంజెక్షన్‌లు కాల్షియం మాత్రలు అందుబాటులో లేక రోగుల బయట కొనుకొనే స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని వెంటనే సవరించాలని కలెక్టర్‌ను కోరగా ఆస్పత్రిలో రోగులకు అందే మౌళిక వసతులు, భోజన వసతులపై వెంటనే నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, జె.రాజేందర్ పాల్గొన్నారు.

బాధిత బాలికకు మద్దతుగా ఎస్పీకి వినతులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

లైంగికదాడికి గురైన మండలానికి చెందిన బాధిత బాలికకు మద్దతుగా పలు సంఘాలు నిందితునిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్పీ డీవీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్లా ఆంజనేయులు నిందితుని కఠినంగా శిక్షించాలని కోరుతూ ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సభ్య సమాజం సిగ్గుపడేలా బాలికపై నిందితుడు లైంగికదాడి చేయడం దారుణమన్నారు. అనంతరం బాలిక కుటుంబాన్ని పరామర్శించి సంఘం తరపున సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో పద్మశాలి జిల్లా కార్యదర్శి గడదాసు మల్లయ్య, నాయకులు కోమటిపెల్లి లింగయ్య, అనుమాండ్ల శ్రీకాంత్, గాజర్ల శైలేందర్, ఆవిడపు ప్రణయ్, తేలివార్ మోహన్, జంజిరాల శ్రీనివాస్, కోమటిపెల్లి యేసయ్య, పొన్న తిరుపతి, గుజ్జ మోహన్, పసుపునూరి రవి, పొన్న చిరంజీవి, జంజిరాల హరీష్, మల్లేష్ పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కలెక్టర్, ఎస్పీలకు సంఘం నాయకులతో కలిసి వేరువేరుగా ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైనూర్ ఘటన మరువక ముందే జిల్లాలో మరో సంఘటన జరగడం బాధాకరమన్నారు. ప్రస్తుత ఏడాదిలో జిల్లాలో 17 లైంగిక దాడుల సంఘటనలు, 18 ఫోక్సో కేసులు నమోదు కావడం పరిస్థితి అద్దం పట్టేలా చేస్తుందన్నారు. ఇప్పటికైనా ఇటువంటి సంఘటనలు జరగకుండా చూడాలని నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా నాయకులు బొట్టుపల్లి సాయికృష్ణ, అనుమాండ్ల శ్రీకాంత్, గాజర్ల శైలందర్ పాల్గొన్నారు.





ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం

- బెండ్ల తెప్పలపై గుండి వాసుల ఫీట్లు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న గుండి గ్రామవాసుల గోస తీరేలా కనిపించడం లేదు. వర్షాకాలం వచ్చిందంటే వాగుతో ఇబ్బంది పడుతున్న ప్రజలు కొంత వానలు తగ్గగానే నీళ్ల అధికంగా ఉండడంతో థర్మకోల్ షీట్లతో బెండ్లు తయారుచేసి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వాగు దాటాల్సిన పరిస్థితి దాపురిస్తోంది. ప్రతిరోజు గ్రామ పంచాయతీకి చెందిన అన్ని గ్రామాలు జిల్లా కేంద్రానికి రావాలంటే తప్పనిసరిగా వాగు దాటాల్సిందే. ఈ పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసిన ప్రయాణం తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. నాయకులు ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా అయ్యేలా చూడాలని కోరుతున్నారు.

పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని బీఎంఎస్ కార్యాలయం ముందున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల (ఉర్దూ, తెలుగు మీడియం)లో నెలకొని ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ ముబీన్, కార్యదర్శి జావీద్ మల్లాస్ డిమాండ్ చేశారు. సోమవారం ఆ పాఠశాలను ఎంఐఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల పాఠశాల గోడ కూలిపోతే సంబంధిత ఎంఈఓ వచ్చి చూసి వెళ్లడమే తప్ప ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కూలిన గోడ పక్కనే కూర్చోని విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారని, విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉన్నందున వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

డీఎస్సీ ఫలితాలలో మండలవాసుల ప్రతిభ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ ఫలితాలలో మండల యువకులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో జిల్లా స్థాయిలో అప్పాజీ సతీష్ మూడవ ర్యాంకు, అప్పాజీ గణేష్ రెండవ ర్యాంకును సాధించారు. డీఎస్సీ ఫలితాలు ఎస్జీటీ విభాగంలో నల్లగొండ అనిల్ ఎనిమిదవ ర్యాంకు, కొయ్యడ సాయి గౌడ్ 19 ర్యాంకును సాధించారు. వారిని మండలవాసులు అభినందించారు.



బెజ్జూరు : రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో మండలవాసులు సత్తా చాటారు. మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయ కొలువుకు ఎంపికయ్యారు. మండలంలోని ముంజంపల్లి గ్రామానికి చెందిన డబ్బుల సురేందర్ (ఎస్‌జీటీ), డబ్బుల మురళి (ఎస్‌జీటీ), పాపన్నపేట గ్రామానికి చెందిన తుమ్మడే కమలాకర్ (ఎస్‌ఏ), చిన్న సిద్దాపూర్ గ్రామానికి చెందిన టాకిరే గణపతి (ఎస్ఏ, టీపీటీ, ఎస్‌జీటీ) మూడింటికి ఎంపిక అయ్యాడు. ఊట్ సారంగపల్లికి కొప్పుల రాజ్ కుమార్ (ఎస్‌జీటీ)కి ఎంపికయ్యారు. మండలానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపిక రావడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రీడా పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల క్రీడా పాఠశాలలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో డీఆర్డీఓ దత్తారం అధ్యక్షతన నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17 నుండి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛతా హీ సేవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చిన్నతనం నుండే మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని, నాటిన ప్రతి మొక్క బతికేలా చూడాలన్నారు. చిన్ననాటి నుండి విద్యార్థులు సమాజ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి మీనారెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ జంగు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
మంగళవారం | అక్టోబర్ 01, 2024 | www.navatelangana.com

మున్సిపల్ సాధారణ సమావేశం

నవతెలంగాణ-మంచిర్యాల



మంచిర్యాల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై మున్సిపల్ సభ్యుడు ఆమోదం తెలిపారు. పట్టణంలోని పలు వార్డుల్లో రూ. 60.90 లక్షలతో అభివృద్ధి చేసేందుకు అంచనా వ్యయానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సాధారణ నిధుల నుండి వివిధ పత్రికల్లో ప్రచురించిన టెండర్ ప్రకటనలకు చెల్లించుటకు గాను కౌన్సిల్ ఆమోదం తెలిపింది. పట్టణంలోని వివిధ రకలైన కేసుల పరిష్కారానికి మంచిర్యాల కోర్టులో దాకాలు చేసిన కేసులకు లీగల్ ఫీజు రు.3.65 లక్షలు చెల్లించుటకు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సల్ల మహేష్, మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణి ఎస్సీడబ్ల్యూఏ ఉద్యోగులకు సోమవారం సీఈఆర్ క్లబ్‌లో క్వాటర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌లో మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాలకు 90 క్వాటర్లను ప్రకటించగా 91 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనియార్టీ ప్రకారం 26 మంది ఉద్యోగులకు పారదర్శకంగా క్వార్టర్లను కేటాయించడం జరిగిందని పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యామ్ సుందర్ తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓ టూ జీఎం రవీందర్, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీజీఎం ఐఈడీ రాజన్న, డీవైపీఎం మైత్రేయ బంధు, రాజలింగు (ఒ.ఎస్) పాల్గొన్నారు.

జన్యుమార్పిడితో పంట మనుగడకే ప్రమాదం



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

వ్యవసాయరంగంలో జన్యుమార్పిడి చేసిన విత్తనాలు ఉపయోగించి పండించే ఆహార పంటల వల్ల ప్రజల మనుగడకే ప్రమాదం వాటిల్ల నుందని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమీషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి ఆందోళన వ్యక్తం చేసారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన జన్యుమార్పిడి పంటలపై దక్షిణాది రాష్ట్రాలు (తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ) రైతు సంఘం నాయకులు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొని పలు విషయాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. రాష్ట్రాల్లో జిల్లాలు, మండలాల వారీగా కిసాన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతులతో పాటు ప్రజలకు జన్యుమార్పిడి దుష్పరిమాణాలపై అవగాహన కల్పించేలా కార్యక్రమాలను నిర్వహించాలని, మితిమీరిన రసాయన వినియోగం, జీవరాశులకు హాని కలిగించే టెక్నాలజీని విడనాడాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న పశువులు పట్టివేత

నవతెలంగాణ-వాంకిడి

గోరఖ్ పూర్ నుంచి కరీంనగర్ వైపు కంటైనర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న పశువులను పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి వద్ద పెట్రోలింగ్ చేస్తుండగా సమాచారంతో మహారాష్ట్ర వైపు నుంచి వస్తున్న కంటైనర్ లారీని తనిఖీ చేయగా తొమిది ఆవులు, రెండు గేదెలు, రెండు దూడలున్నాయి. పశువులను తరలిస్తున్న వ్యక్తులను విచారించగా మధ్యప్రదేశ్‌లోని చింద్వాడ జిల్లాకు జగన్నాథ్ రాథోడ్ పశువులను కంటైనర్ లారీలో తరలిస్తున్నట్లు తెలిపారు. దీంతో ఏ1 జగన్నాథ్ రాథోడ్, ఏ2. సురేందర్ యాదవ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న పశువులను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించి లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన కార్మికునికి ఘన సన్మానం

నవతెలంగాణ-రెబ్బెన

ఉద్యోగ విరమణ పొందిన గొర్లపల్లి చంద్రయ్యని గోలేటి సీహెచ్‌పీలో కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఫిట్ సెక్రటరీ ఎంబటి రామయ్య మాట్లాడుతూ ప్రతి కార్మికుని జీవితంలో ఉద్యోగ విరమణ రోజు వస్తుందని, 40 సంవత్సరాలు కలిసి కార్మికులతో ఉండి దిగిపోయేటప్పుడు చాలా బాధ కూడా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ ఎస్‌సీ కోటయ్య, ఈఈ శ్రావణ్ కుమార్, ఫోర్‌మెన్ రాజేష్, కృష్ణ సంతోష్, సంపత్, వేణు, ఆరిఫ్, అలీ, సమీ, రాజబాబు, సింగరేణి కార్మికులు పాల్గొన్నారు.

8న కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల ఎనిమిదిన కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారాయణ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కబడ్డీ పోటీల కరపత్రాలను విడుదల చేశారు. ఈ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.16 వేలు, ద్వితీయ బహుమతి రూ. ఎనిమిది వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రవేశ ఫీజు రూ.700 చెల్లించి పోటీలో పాల్గొనాలని, ఆసక్తి గల క్రీడాకారులు దుర్గం ప్రశాంత్ 9705749712, 8008554313లను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు ప్రశాంత్, కార్యకర్తలు పాల్గొన్నారు.

దూరవిద్య డిగ్రీ, పీజీలో చేరేందుకు సంప్రదించాలి

నవతెలంగాణ-ఉట్నూర్

కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య(డిస్టెన్స్)లో డిగ్రీ, పీజీలో చేరే వారు నేరుగా కళాశాలను సంప్రదించాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో స్థానిక ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దూరవిద్య కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. డిగ్రీ, పీజీలో చేరేందుకు ఆసక్తి గల అభ్యర్థులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. ఫీజు చెల్లింపులలో ఇతరులకు గూగుల్ పే, ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేస్తే కళాశాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. కళాశాలకు వచ్చి తప్పనిసరిగా గుర్తింపు పొందిన రశీదు పొందాలని కోరారు. వివరాలకు దూరవిద్య కోఆర్డినేటర్ కరుణాకర్(9490452742)ను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఎస్సీ విద్యార్థులు స్కాలర్షిప్‌లకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

2024-25 సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులముల విద్యార్థులు నూతన మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ప్రక్రియ 3 దశలలో ఉంటుందని, డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ దశలు ఉంటాయని, మొదటి దశలో ఈ-పాస్ వెబ్‌సైట్‌లో నూతన, రెన్యువల్ రిజిస్ట్రేషన్ భాగంగా తన ఆధార్ నెంబరును సమర్పించి ఎస్ఎస్‌సీ వివరాలతో సరి చేసుకోవలసి ఉంటుందని, వివరాలు సరి అయిన తరువాత తదుపరి దశలో బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాలని, ఒక వేళ వివరాలు సరికానట్లయితే సంబంధిత విద్యార్థి తన ఆధార్ వివరాలను మీ-సేవ కేంద్రంలో అప్డేట్ చేయవలసి ఉంటుందని తెలిపారు. 3వ దశలో గతంలో మాదిరిగా సంబంధిత ధ్రువపత్రాలను అప్లోడ్ చేసి ఉపకారవేతన వివరాలు పూర్తిగా నింపి దరఖాస్తును సమర్పించాలని, ఒకవేళ ఆధార్ ఫీడ్ కానట్లయితే వెంటనే సంబంధిత బ్యాంక్‌లో సంప్రదించాలని తెలిపారు. 3 దశలలో దరఖాస్తు ప్రక్రియ పూర్తి అయిన తరువాత సదరు దరఖాస్తు తదుపరి ప్రక్రియకు సంబంధిత కళాశాల ప్రిన్సిపల్కు సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు షెడ్యూల్డ్ కులముల విద్యార్థులకు తగు సూచనలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, ఇతర వివరాలకు జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని ఎఫ్-3లో గల జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలి

నవతెలంగాణ-సిర్పూర్(టి)



ప్రభుత్వాలు పేద ప్రజల పిల్లల విద్య ఆరోగ్యం ప్రతి రూపాయిని సక్రమంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో కాగజ్నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తో కలిసి పర్యటించారు, పాఠశాల ఆవరణ ప్రాంతాన్ని మొత్తం తిరిగి పాఠశాలలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ రవీందర్ ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. పలు సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆశ్రమ పాఠశాలలో మరుగుదొడ్లు మూత్రశాలలు ఏమైనా సమస్యలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలని కోరారు. ప్రభుత్వం ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదివితే మన గమ్యాన్ని చేరుకోవచ్చని తెలిపారు. కష్టపడి చదివితే ఉన్నత ఫలితాలు సాధించవచ్చనీ విద్యార్థులకు ఉద్బోధించారు. విద్యార్థులకు అందుతున్న భోజన వసతి గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని మెను పాటించాలని అన్నారు. ఈయన వెంట స్పెషల్ అధికారి ప్రభాకర్ రావు, అడిషనల్ రామకృష్ణ, తాసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎస్సై కమలాకర్ తదితరులు ఉన్నారు.

ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరి



నవతెలంగాణ-నస్పూర్

ప్రతి ఒక్కరూ ప్రతిరోజు తప్పకుండా వ్యాయామం చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-8 డిస్పెన్సరీలో ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా డీవై సీఎంఓ రమేష్ బాబు ఆధ్వర్యంలో హృదయ సంబంధిత వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, వ్యాధి వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాన్ని జీఎం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, ప్రజలు అందరూ గుండెపోటు నివారణకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని, అలాగే ఎవరైనా ధూమపానం, మద్యపానం అలవాట్లు ఉన్నట్లయితే మానుకోవాలని తెలిపారు. అలాగే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని, ప్రతిరోజు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉండాలని, శరీర బరువును అదుపులో ఉంచుకోవాలని, రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నియంత్రణలో పెట్టుకోవాలని సూచించారు. గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మందులను ప్రతిరోజు వాడుతూ ఉండాలని, అలాగే సంబంధిత ఆస్పత్రులలో రెగ్యులర్‌గా చెకప్ చేసుకుంటూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కే వెంకటేశ్వర్ రెడ్డి, డాక్టర్ వేదవ్యాస్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి, వైద్యులు మనీషా, పింకీ, డిస్పెన్సరీ పిట్ కార్యదర్శి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అవయవ దానానికి ముందుకు రావాలి

నవతెలంగాణ-నస్పూర్

మరణానంతరం అవయవాలు దానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ఆర్కే-7 గనుల గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు పేర్కొన్నారు. సోమవారం ఆర్కే-న్యూటెక్ గని వద్ద సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర దానం, అవయవ దానంపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవయవ దానంపై ఉన్న అపోహలను వీడాలని తెలిపారు. నేత్ర దానం చేస్తే మరొక్కరికి చూపును ప్రసాదించోచ్చునని పేర్కొన్నారు. ఇప్పటి వరకు నేత్ర దానం చేసిన వారిలో సింగరేణీయులే ఎక్కువగా ఉండటం హర్షనీయమన్నారు. సంస్థలోకి కొత్తగా వస్తున్న ఉద్యోగులు నేత్ర, అవయవ దానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. అనంతరం నేత్ర దానం చేసేందుకు ముందుకొచ్చిన ఉద్యోగులకు ధ్రువ పత్రాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్కే-న్యూటెక్ గని మేనేజర్ స్వామిరాజు, గుర్తింపు సంఘం పిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, సదాశయ ఫౌండేషన్ అధ్యక్షుడు



సీహెచ్ లింగమూర్తి, సభ్యులు మాక రమేష్, మధు, కె. వెంకటేశం, గని రక్షణాధికారి కొంటె గణేష్, సంక్షేమాధికారి పాల్ సృజన్, ఫిట్ ఇంజనీర్ రాజగోపాల చారి, సర్వే అధికారి పిచ్చేశ్వర్ రావు పాల్గొన్నారు.

కాసిపేట-1, 2వ గనులపై విరమణ ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కాసిపేట-1వ గనిలో సోమవారం ముగ్గురు ఉద్యోగులు పదవి విరమణ పొందిన సందర్భంగా వారికి ఘనంగా సన్మానం చేశారు. ఎస్ఓఎల్ ఆపరేటర్ కొండ కుమార స్వామి, సపోర్ట్ మెన్ కల్యాణం దామోదర్, స్వీపర్ చోటిన్లు పదవి విరమణ పొందగా గని మేనేజర్ భూ శంకరయ్య, గుర్తింపు సంఘం నాయకులు, గని అధికారులు, తోటి ఉద్యోగులు ఘనంగా శాలువాలు, పూలమాలలతో సత్కరించి జ్ఞాపకలు అందించారు. గని మేనేజర్ భూ శంకరయ్య మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం మొదటి సారి ఉద్యోగులు దిగిపోయిన రోజే హెల్త్ కార్డ్ ఇవ్వాలని నిర్ణయించారని, అందులో భాగంగా ఉద్యోగులకు హెల్త్ కార్డ్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్, పిట్ సెక్రెటరీ మీనుగు లక్ష్మీ నారాయణ, రక్షణాధికారి రవీంద్ర, వైస్ ప్రెసిడెంట్ బియ్యాల వెంకట స్వామి, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, సీనియర్ వెల్ఫేర్ ఆఫీసర్ మీర్జా గౌస్, బన్న లక్ష్మన్ దాస్, రాజేందర్, రవి, టీబీజీకేఎస్ నాయకులు వొడ్నాల రాజన్న, శంకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అదేవిదంగా కాసిపేట-2 ఇంక్లైన్ గనిపై ఏఐటీయూసీ నాయకులు, మైనింగ్ సర్దార్ తీర్థాల చంద్రయ్య పదవి విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ నాయకులు భాగం మల్లేశ్, బియ్యాల వెంకటస్వామి, పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, బొద్దుల వెంకటేశ్, సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హిందూ దేవాలయాలను ఆదాయ వనరులగా చూస్తున్నారే తప్ప పవిత్రపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విశ్వహిందూ పరిషత్ విభాగ్ ప్రచరక్ శివకుమార్ అన్నారు. తిరుమల లడ్డూ వివాదంపై సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని రాష్ట్ర వ్యాప్త నిరసనల్లో భాగంగా సోమవారం గోపాలకృష్ణ మఠం ఎదుట ఆందోళన చేపట్టారు. దేవాలయాల రక్షణతో పాటు పవిత్రతను కాపాడుకోవడానికి హిందువులు సంఘటితం కావాలన్నారను. కార్యక్రమంలో వీహెచ్‌పీ బోండ్ల నారాయణ, కార్యదర్శి గిత్తే రవి కుమార్, ఉత్సవ సమితి అధ్యక్షుడు హన్మండ్లు, ప్రఫుల్ వర్షే, రఘువేంద్రనాథ్ యాదవ్, దినేష్ మటోలియ, శ్రీరాంశర్మ, దత్తాత్రేయ, రజని, రేఖ, శారద పాల్గొన్నారు.

అక్షరలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో సోమవారం విద్యార్థులు ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగు రంగుల ముగ్గులు వేసి తీరొక్క పువ్వులు సేకరించి బతుకమ్మను తయారు చేశారు. అంతరం బతుకమ్మ పాటలు పాడుతూ కోలాటాలు వేశారు. స్థానిక చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుభాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నవతెలంగాణ-మంచిర్యాల

జిల్లా కేంద్రంలోని మేదరివాడకు చెందిన చింత విజయలక్ష్మి(47) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. సీఐ బన్సీలాల్ తెలిపిన వివరాల ప్రకారం..విజయలక్ష్మి భర్త గత 15 సంవత్సరాల క్రితం మృతి చెందాడు, ఇటీవల కూతురు వివాహం చేసిన విజయలక్ష్మి మంచిర్యాలలోని తన సొంత ఇంట్లో ఒక్కతే నివసిస్తుంది. విజయలక్ష్మి నివసం ఉండే ఇంటి, రోడ్ పక్కన ఉన్న తనకు సంబంధించిన షట్టర్‌లకు వచ్చే కిరాయి డబ్బులతో విజయలక్ష్మి జీవనం కొనసాగించేది. గత కొన్ని రోజులుగా ఆస్థి విషయంలో తన భర్త తరపు వారితో తరచు గొడవలు జరిగేవి. అదే క్రమంలో ఇటీవల చంపుతానని బెదిరించినట్లు విజయలక్ష్మి కూతురు భవిత తెలిపింది. గొడవల నేపథ్యంలో మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేసినట్లు తెలిపింది. నిన్న ఉదయం నుండే విజయలక్ష్మి ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి ఈ రోజు ఉదయం ఇంటికి వచ్చి చూడగా విజయలక్ష్మి కుర్చీలో కూర్చొని మృతి చెంది ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. విజయలక్ష్మి కూతురు భవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయలక్ష్మి ది హత్య ఆత్మహత్యనా అన్న కోణంలో విచారిస్తునట్లు సీఐ తెలిపారు.

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిర్మల్

చెరువులో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం మండలంలోని సిర్గాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ భీంరావు తెలిపిన వివరాల ప్రకారం.. చెరువులో శవం తెలియడడం చూసిన స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం పోలీసులు చెరువు వద్దకు వెళ్లారు. రెస్క్యూ టీంతో శవాన్ని బయటకు తీశారు. శవం తాలూకా ఆనవాళ్లు ఎవరికి అంతుచిక్కలేదని వ్యక్తి నీలం రంగు నలుపు రంగు గీతల చొక్కా, నలుపు రంగు ప్యాంటు ధరించుకొని ఉన్నాడని తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించమని తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన కొప్పుల బుచ్చయ్య(50) అప్పుల బాధ భరించలేక పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..బుచ్చయ్య గల్ఫ్ దేశానికి వెళ్లేందుకు అప్పు చేసి డబ్బులు కట్టి మోసపోయాడు. మేదరిపేటలో తనకున్న నాలుగు గంటల భూమి అమ్మినా అప్పులు తీరకపోవడంతో అప్పులు ఎలా చెల్లించేదని కుటుంబ సభ్యులతో చెప్పుకుంటూ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇంట్లో ఉన్న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కొరకు వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సోమవారం మృతి చెందాడు. కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధ్యాయుడే విద్యార్థికి మార్గదర్శి

నవతెలంగాణ-జన్నారం

ఉపాధ్యాయుడి విద్యార్థికి మార్గదర్శి అని ఎంఈఓ విజయ్ కుమార్, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ బోధించిన లావుడియా చందూలాల్ పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముందుగా చందులాల్ దంపతులకు శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మేమెంటోను అందజేశారు. కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు బంధుమిత్రులతో పాటు, మాజీ వైస్ ఎంపీపీ వినయ్, మధుసూదన్, ముజఫర్ గర్రం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

గనుల్లో విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-6 గనిలో పనిచేస్తూ పదవి విరమణ పొందిన ఉద్యోగులను గని మేనేజర్ ఈ తిరుపతి సోమవారం ఘనంగా సన్మానించారు. అలాగే న్యూటెక్ గనిలో పని చేస్తూ పదవి విరమణ పొందిన ఉద్యోగులను ఆర్కే-7 గనుల గ్రూప్ ఏజెంట్ మాలోతు రాముడు, గని మేనేజర్ స్వామి రాజు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగానంతరం తదుపరి జీవితాన్ని కుటుంబ సభ్యులతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. విధి నిర్వహనలో ఉద్యోగులు కంపెనీకి చేసిన సేవలను వారు కొనియాడారు. ప్రతిఒక్కరూ రక్షణతో కూడిన విధులు నిర్వహించాలని సూచించారు. వారి సుదీర్ఘ సర్వీసులో రక్షణ సూత్రాలను పాటిస్తూ విధులు నిర్వహించినందుకు అభినందించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని మిగతా కార్మికులు పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పీఎల్‌ఆర్ బోనస్ సాధనపై సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పీఎల్‌ఆర్ బోనస్ సాధనకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బియ్యాల వెంకటస్వామి మాట్లాడుతూ బొగ్గు గని కార్మికులకు పీఎల్‌ఆర్ బోనస్‌పై 29వ తేదీన ఢిల్లీలో జేబీసీసీఐ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సమావేశానికి ఏఐటీయూసీ నాయకులు రవీంద్ర కుమార్ అర్జిత్ సింగ్‌తో పాటు నాలుగు జాతీయ కార్మిక సంఘాలు పాల్గొన్నట్లు వివరించారు. ఈ చర్చలలో 2022-23 ఏడాదికి రూ.85,500 ఇవ్వడం జరిగిందని, ఈ ఏడాది 2023-24 ఏడాదికి రూ.8250 పెరుగుదలతో రూ.93,250 పీఎల్‌ఆర్ బోనస్ ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మీనుగు లక్ష్మీనారాయణ, వి రాజేందర్, పార్వతి సురేష్, చిప్పరి శ్రీహరి, రంజిత్ కుమార్, బల్లెం శ్రీనివాస్, బియ్యాల రాజన్న, ఆంజనేయులు, సురేష్, లక్ష్మణ్, శివ పాల్గొన్నారు.

జర్నలిస్టును పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రేఖా నాయక్

నవతెలంగాణ-జన్నారం

ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకున్న సీనియర్ జర్నలిస్టు జన్నారం ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్యను ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే రేఖా శ్యామ్ నాయక్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముత్యం సతీష్, నాయకులు రజాక్, రాజ్ కుమార్, మౌలాన అజహర్, పొనకల్ మాజీ ఎంపీటీసీ రాగుల శంకర్ ఉన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు కార్యచరణ ఖచ్చితంగా అమలు చేయడం జరుగుతుందని, అర్హత గల వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీకి ఫారం-18, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఫారం-19 ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని, అక్టోబర్ 16వ తేదీన మొదటి రిపబ్లికేషన్, 25వ తేదీన రెండవ రిపబ్లికేషన్ చేయడం జరుగుతుందని, నవంబర్ 6న చివరి గడువని తెలిపారు. నవంబర్ 20వ తేదీన నమోదు అయిన దరఖాస్తులను పరిశీలించి ముసాయిదా జాబితా సిద్ధం చేసి 23న ప్రచురించడం జరుగుతుందని, 23 నుండి డిసెంబర్ 9వ తేదీ వరకు ముసాయిదా జాబితాపై ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, డిసెంబర్ 25వ తేదీన ఫిర్యాదులు, అభ్యంతరాలను పరిష్కరించి సంబంధిత పత్రాలను పరిశీలించి 30వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. మెదక్ -నిజామాబాద్-ఆదిలాబాద్-కరీంనగర్ నియోజకవర్గాలకు జరుగనున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ప్రతి ఒక్కరు తమ వివరాలు నమోదు చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు.